తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం - 30 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 362 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# యాసంగిలో జాతీయ అగ్రస్థానంలో తెలంగాణ

## అరవై లక్షల టన్నుల కొనుగోలు
## రైతుల ఖాతాల్లో చెల్లింపులు
## దేశానికి ధాన్య భాండాగారం

**హైదరాబాద్, 29 మే (తెలంగాణ ముచ్చట్లు):**

యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నిర్వహించిన విలేకరుల

మిగతా 2లో..




# ఉద్యోగుల ఆరోగ్యానికి సింగరేణి ప్రాధాన్యం

## రామగుండం స్టేడియాన్ని సందర్శించిన సీఎండీ
## క్రీడా, వ్యాయామ సౌకర్యాల పరిశీలన
## ఆరోగ్యకర జీవనశైలిపై ఉద్యోగులకు సూచనలు

**పెద్దపల్లి, 29 మే (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి ఉద్యోగుల ఆరోగ్యం, శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతకు సంస్థ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం రామగుండం 1 ఏరియాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని ఆయన సంస్థ డైరెక్టర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన వివిధ క్రీడా,

మిగతా 2లో..



# హైడ్రాతో ట్రాన్స్‌జెండర్లకు గౌరవ జీవితం

## ఉద్యోగంతో వచ్చిన ఆత్మవిశ్వాసం
## ప్రజా ఆస్తుల పరిరక్షణలో కీలక పాత్ర
## సమాజంలో ప్రత్యేక గుర్తింపు

**హైదరాబాద్, 29 మే (తెలంగాణ ముచ్చట్లు):**

హైడ్రాలో లభించిన ఉద్యోగ అవకాశాలు ట్రాన్స్‌జెండర్ల జీవితాల్లో కొత్త ఆశలను నింపుతున్నాయి. ఒకప్పుడు వివక్ష, నిరాకరణ ఎదుర్కొన్న వారు నేడు ప్రజా ఆస్తుల పరిరక్షణలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సమాజంలో గౌరవాన్ని సంపాదిస్తున్నారు. హైడ్రా ఏర్పాటు చేసిన "ఈగల్ టీమ్"లో ప్రస్తుతం 16 మంది ట్రాన్స్‌జెండర్లు సేవలందిస్తున్నారు. వీరిలో 11 మంది ట్రాన్స్ ఉమెన్‌లు, ఐదుగురు ట్రాన్స్ మెన్‌లు ఉన్నారు.

మిగతా 2లో..





# సౌర గ్రామాల దిశగా తెలంగాణ ముందడుగు

**బోనకల్‌లో మోడల్ సోలార్ విలేజ్ ప్రారంభం**

**ప్రతి ఇంటికి రెండు కిలోవాట్ల సౌర విద్యుత్ వ్యవస్థ**

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**ఖమ్మం, 29 మే (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని విస్తృత స్థాయిలో పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా వేదికగా నిలిచింది. మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విస్తృతంగా పర్యటించి చిన్నబీరవల్లి గ్రామంలో మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి ఇంటి పై కప్పుపై ఏర్పాటు చేసిన రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ వ్యవస్థలను ఆయన ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.

మిగతా 2లో..



# ఆర్టీఐ కార్యకలాపాలపై సమీక్ష

## ముఖ్యమంత్రిని కలిసిన కమిషన్

## ఏడాది పనితీరుపై వివరణ.. సమాచార హక్కుపై చర్చ

**హైదరాబాద్, మే 29 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ చీఫ్ కమిషనర్, కమిషనర్లు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్‌లో బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం అమలు, కమిషన్ కార్యకలాపాలు, ఏడాది కాలంలో చేపట్టిన కార్యక్రమాలపై ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్ జి చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కమిషనర్లు పీవీ శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్య రెడ్డి, దేశాల భూపాల్ పాల్గొన్నారు. కమిషన్ పనితీరు, ప్రజలకు సమాచార హక్కు చట్టం ద్వారా అందుతున్న సేవల గురించి ముఖ్యమంత్రికి సమగ్ర నివేదిక సమర్పించినట్లు సమాచారం.గత ఏడాది కాలంలో సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తులు, అప్పీలు, ఫిర్యాదుల పరిష్కారం,

మిగతా 2లో..

# పట్టణ పేదలకు గృహభరోసా

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా
- సమగ్ర ప్రణాళికలపై దృష్టి..
- వేగంగా పనుల ప్రారంభం.. మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మే 29 (తెలంగాణ ముచ్చట్లు):**

పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేస్తోంది. రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై పలు కీలక అంశాలను చర్చించారు.

మిగతా 2లో..



# రైతు డిస్కమ్ ప్రతిపాదనపై కవిత అభ్యంతరం



## తెలంగాణ ఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న కవిత
## రైతుల భవిష్యత్తుతో ముడిపడిన అంశమని వ్యాఖ్య
## ప్రతిపాదనను తిరస్కరించాలని ఈఆర్‌సీకి విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 29 (తెలంగాణ ముచ్చట్లు):**

రైతు డిస్కమ్ ఏర్పాటు ప్రతిపాదన తెలంగాణ రైతాంగ భవిష్యత్తును ప్రభావితం చేసే అత్యంత కీలక అంశమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, రైతు డిస్కమ్ ఏర్పాటు ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని ఈఆర్‌సీని కోరారు. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అంశాన్ని పరిమిత స్థాయిలో చర్చించడం సరైన పద్ధతి కాదన్నారు. తెలంగాణలో రైతులు ఎంతో కష్టపడి 29 లక్షల బోర్లు ఏర్పాటు చేసుకున్నారని, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యుత్ రంగంలో భారీ పెట్టుబడులు పెట్టడం వల్ల వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని కవిత పేర్కొన్నారు. గతంలో సుమారు 20 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి చేసే తెలంగాణ ప్రస్తుతం కోటి 40 లక్షల టన్నుల ధాన్యాన్ని పండించే స్థాయికి చేరుకుందని అన్నారు. ఈ అభివృద్ధికి నిరంతర విద్యుత్ సరఫరా ప్రధాన కారణమని,

మిగతా 2లో..

# భగీరథ్‌కు జైలు రిమాండ్

- మూడు రోజుల పోలీసు కస్టడీ ముగింపు
- పోక్సో కేసులో విచారణ కొనసాగింపు
- కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలింపు

2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రైతు డిస్కమ్ ప్రతిపాదనపై కవిత అభ్యంతరం

(మొదటి పేజీ తరువాయి)

రైతు డిస్కమ్ వల్ల ఆ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. రైతు డిస్కమ్ ప్రతిపాదన నిజంగా రైతులకు మేలు చేసేదైతే ప్రభుత్వం దానిని ఎందుకు రహస్యంగా ఉంచిందని కవిత ప్రశ్నించారు. గత ఆరు నెలలుగా ఈ అంశాన్ని ప్రజలకు తెలియకుండా ఉంచారని ఆరోపించారు. అసెంబ్లీలో చర్చించకుండా, రైతు సంఘాలతో సంప్రదించకుండా ముందుకు తీసుకెళ్లడం అనుమానాలకు తావిస్తోందన్నారు. రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయలేదని విమర్శించారు. డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం చేస్తున్న వాదనలను కూడా కవిత ప్రస్తావించారు. ఇప్పటికే డిస్కమ్‌లకు వేల కోట్ల రూపాయల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, ఆర్థిక సంక్షోభానికి మొదటి బాధ్యుడు ప్రభుత్వమేనని పేర్కొన్నారు. డిస్కమ్‌లు భారీ నష్టాల్లో ఉన్నాయని చెబుతూ కొత్త సంస్థను ఏర్పాటు చేయడం వల్ల సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులకు, ఉచిత విద్యుత్ పథకాలకు సంబంధించిన సబ్సిడీ మొత్తాలను ప్రభుత్వం సకాలంలో చెల్లిస్తే ప్రస్తుత వ్యవస్థనే బలోపేతం చేయవచ్చని అభిప్రాయపడ్డారు. రైతు డిస్కమ్ అమలులో ఉద్యోగుల అంశం కూడా ఆందోళన కలిగిస్తోందని కవిత పేర్కొన్నారు. లక్షలాది వ్యవసాయ కనెక్షన్లకు సేవలు అందించాల్సిన పరిస్థితిలో తక్కువ సంఖ్యలో సిబ్బందిని కేటాయించడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, నిర్వహణ పనులు తీవ్రంగా ప్రభావితమవుతాయని అన్నారు. ప్రస్తుతం ఉన్న వ్యవస్థలోనే సమస్యలను పరిష్కరించవచ్చని, కొత్త డిస్కమ్ ఏర్పాటు వల్ల రైతులకు అదనపు ప్రయోజనం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతు డిస్కమ్ ఏర్పాటు ప్రతిపాదనపై అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కవిత కోరారు. పైలట్ ప్రాజెక్టు అమలు చేసి ఫలితాలను పరిశీలించిన తర్వాత మాత్రమే ముందుకు వెళ్లాలని సూచించారు. రైతులు ఎప్పుడూ ప్రత్యేక డిస్కమ్ కోరలేదని, ఈ ప్రతిపాదన వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈఆర్‌సీ రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనను తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రైతుల భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాల్లో ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటించాలని కోరారు.

# హైడ్రాతో ట్రాన్స్‌జెండర్లకు గౌరవ జీవితం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగం ద్వారా ఆర్థిక స్వావలంబనతో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెరిగిందని వారు చెబుతున్నారు. హైడ్రా చేపడుతున్న చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కార్యక్రమాల్లో ఈగల్ టీమ్ సభ్యులు చురుకుగా పాల్గొంటున్నారు. ఆక్రమణలను తొలగించే సమయంలో ప్రజలకు అవగాహన కల్పించడం, మహిళలతో మాట్లాడి పరిస్థితులను సర్దిచెప్పడం, అధికారులు-ప్రజల మధ్య సమన్వయం చేయడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. వారి సహనం, భావోద్వేగాలను అర్థం చేసుకునే సామర్థ్యం ఫీల్డ్ స్థాయిలో మంచి ఫలితాలు ఇస్తోందని అధికారులు ప్రశంసిస్తున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ ప్రాంతంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ చర్యల్లోనూ, మాదాపూర్‌లోని ఈదులకుంట పరిరక్షణ కార్యక్రమంలోనూ ట్రాన్స్‌జెండర్లు విశేష పాత్ర పోషించారు. ప్రజా ఆస్తులను కాపాడేందుకు హైడ్రా చేపట్టిన చర్యల్లో భాగస్వాములవడం తమకు గర్వకారణంగా ఉందని వారు పేర్కొంటున్నారు. విధులు ఎక్కడైనా, ఎప్పుడైనా నిర్వహించేందుకు సిద్ధంగా ఉంటామని చెబుతున్నారు. హైడ్రాలో ఉద్యోగం తమ జీవితాలను పూర్తిగా మార్చిందని ఈగల్ టీమ్ సభ్యురాలు గాయత్రి తెలిపారు. డబ్బుకంటే గౌరవమే తమకు ముఖ్యమని, యూనిఫాం ధరించి విధులకు వెళ్లినప్పుడు సమాజం తమను గౌరవంగా చూస్తోందని చెప్పారు. అవకాశం ఇస్తే ట్రాన్స్‌జెండర్లు ఏ రంగంలోనైనా రాణించగలరని, హైడ్రాలో తమ సేవలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, హైడ్రా అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మరో సభ్యురాలు రుచిత మాట్లాడుతూ ప్రకృతిని కాపాడే బాధ్యతలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. పార్కులు, చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషిస్తున్నామని చెప్పారు. హైడ్రా ద్వారా తమకు ప్రత్యేక గుర్తింపు లభించిందని, ప్రజల్లో విశ్వాసం ఉన్న సంస్థలో పనిచేయడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. తాన్వీరాయ్ మాట్లాడుతూ గతంలో ట్రాన్స్‌జెండర్లను సమాజం చిన్నచూపు చూసేదని, ఉపాధి అవకాశాలు కూడా దొరకేవి కావని గుర్తుచేశారు. ఇప్పుడు యూనిఫాం ధరించి విధులకు వెళ్లినప్పుడు అందరూ గౌరవంగా మాట్లాడుతున్నారని చెప్పారు. హైడ్రా కల్పించిన అవకాశంతో తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నామని, సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడుపుతున్నామని తెలిపారు. హైడ్రా ద్వారా వచ్చిన ఈ మార్పు ట్రాన్స్‌జెండర్ల సాధికారతకు నిదర్శనంగా నిలుస్తోంది.

# యాసంగిలో జాతీయ అగ్రస్థానంలో తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా యాసంగి సీజన్‌లో జరుగుతున్న మొత్తం ధాన్యం కొనుగోళ్లలో ప్రస్తుతం సుమారు 60 శాతం తెలంగాణ నుంచే జరుగుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సీజన్ ముగిసే నాటికి ఈ వాటా 75 శాతానికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 24 లక్షల మెట్రిక్ టన్నులు, తమిళనాడులో 11 నుంచి 12 లక్షల మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రలో 3 లక్షల మెట్రిక్ టన్నులు, కేరళలో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కాగా తెలంగాణ 60 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుతో అగ్రస్థానంలో నిలిచిందని వివరించారు.

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి 52 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే కొనుగోలు చేయడానికి అంగీకరించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 60 లక్షల మెట్రిక్ టన్నుల మార్కును దాటిందని మంత్రి తెలిపారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడలేదని అన్నారు. రాష్ట్ర రైతులు సాధించిన రికార్డు స్థాయి ఉత్పత్తి కారణంగానే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. యాసంగి 2025-26లో రాష్ట్రవ్యాప్తంగా 64.36 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి సుమారు 141 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు సుమారు 13 వేల రవాణా వాహనాలను వినియోగంలోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. కొనుగోలు, రవాణా, నిల్వల నిర్వహణ కోసం రెండు లక్షల మందికి పైగా సిబ్బందిని రంగంలోకి దింపినట్లు వెల్లడించారు. రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు కనీస మద్దతు ధర కింద రూ.11,050 కోట్లను నేరుగా జమ చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఖరీఫ్, యాసంగి సీజన్లను కలుపుకుని రైతులకు చెల్లింపులు, కొనుగోలు కార్యకలాపాల కోసం సుమారు రూ.39,300 కోట్ల మేర వ్యయం జరుగుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుందని చెప్పారు. వర్షానికి తడిసిన 10,214 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా ఉడికించిన బియ్యం మిల్లులకు తరలించి రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. తెలంగాణ ప్రస్తుతం దేశ ఆహార భద్రతా వ్యవస్థకు వెన్నెముకగా మారిందని మంత్రి అన్నారు. భారత ఆహార సంస్థకు అత్యధిక బియ్యం సరఫరా చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. మార్కెట్ యార్డులకు వచ్చే ప్రతి ధాన్య గింజను కొనుగోలు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. రైతులకు పూర్తి మద్దతు అందిస్తూ కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# ఆర్టీఐ కార్యకలాపాలపై సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్ చేపట్టిన అవగాహన కార్యక్రమాల గురించి కూడా చర్చించారు. ప్రజలకు పారదర్శక పాలన అందించడంలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తోందని కమిషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో జవాబుదారీతనం పెంపొందించడంలో ఈ చట్టం ప్రాధాన్యాన్ని వివరించారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు ప్రభుత్వ వ్యవహారాలపై అవగాహన పెరుగుతోందని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. సమాచారాన్ని సకాలంలో అందించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. కమిషన్ పనితీరును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలపై కూడా వివరాలు అందించారు. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం అమలును మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడంతో పాటు సమాచార హక్కు దరఖాస్తుల పరిష్కారంలో జాప్యాలను తగ్గించే చర్యలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. పారదర్శక పరిపాలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ భేటీ సందర్భంగా కమిషన్ సభ్యులు తమకు సహకరిస్తున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సమాచార హక్కు చట్టం లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి కొనసాగిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల హక్కుల పరిరక్షణకు కమిషన్ నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# సౌర గ్రామాల దిశగా తెలంగాణ ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ స్వావలంబన సాధించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి విడతగా 81 గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి రెండు కిలోవాట్ల సౌర విద్యుత్ వ్యవస్థలు, వ్యవసాయ మోటార్లకు 7.5 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర ప్యానెల్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమానికి సుమారు రూ.1,380 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఖమ్మం జిల్లాకు ఈ పథకంలో ప్రత్యేక ప్రాధాన్యం లభించిందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జిల్లాలో 27 గ్రామాలను ఎంపిక చేసి రూ.445 కోట్ల వ్యయంతో 16,837 గృహాలకు సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసే పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో పనులు పురోగతిలో ఉండగా, త్వరలోనే పూర్తి స్థాయిలో అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

# పట్టణ పేదలకు గృహభరోసా

(మొదటి పేజీ తరువాయి)

పట్టణాల్లో నివసించే పేదలకు ఉపాధికి ఆటంకం కలగకుండా గౌరవప్రదమైన జీవనం అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అర్బన్ ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమం అమలుపై సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. క్యూర్ పరిధిలోని ఇరవై నాలుగు నియోజకవర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో అధికారులు రూపొందించిన పలు నమూనా డిజైన్లను మంత్రి పరిశీలించారు. నిర్మాణ నాణ్యతతో పాటు భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకొని రూపకల్పనలు ఉండాలని స్పష్టం చేశారు. రాబోయే నలభై నుంచి యాభై సంవత్సరాల అవసరాలను ముందుగానే అంచనా వేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రి సూచించారు. కేవలం నివాస గృహాల నిర్మాణంతో సరిపెట్టకుండా, ప్రజల జీవన విధానం, జనాభా పెరుగుదల, పట్టణ విస్తరణ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా సమగ్ర మౌలిక సదుపాయాలతో కూడిన కాలనీల నిర్మాణం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ప్రతి గృహ సముదాయంలో డ్రైనేజీ వ్యవస్థ, వాహనాల పార్కింగ్ సదుపాయాలు, వాణిజ్య అవసరాలకు అనువైన స్థలాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే పది అంతస్తుల వరకు భవనాలు నిర్మించే అవకాశాలను కూడా పరిశీలించాలని సూచించారు. పట్టణాల్లో భూమి కొరతను దృష్టిలో ఉంచుకొని నిలువు నిర్మాణాలపై దృష్టి సారించాలని తెలిపారు. హాల్, పడకగది, వంటగది, స్నానగది వంటి విభాగాల రూపకల్పనలో ప్రజల అవసరాలకు అనుగుణంగా విశాలత ఉండాలని మంత్రి పేర్కొన్నారు. వాస్తు అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని కుటుంబాలు సౌకర్యవంతంగా జీవించేలా నమూనాలు రూపొందించాలని సూచించారు. పేద కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రతి ఇంటి రూపకల్పన ఉపయోగపడే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. పార్కింగ్‌తో పాటు చిన్న వ్యాపారాల నిర్వహణకు అనువైన షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి, అక్కడి ప్రజలకు అదే ప్రాంతంలో గృహాలు నిర్మించి అందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి తెలిపారు. ప్రజలు తమ ఉపాధి కేంద్రాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు రోజువారీ కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో పట్టణ పేదలకు నాణ్యమైన గృహాలు అందించే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# జమ్మికుంట–బిసుగిరిషరీఫ్ రైల్వే మార్గంలో గుర్తుతెలియని మహిళ మృతి



**జమ్మికుంట టౌన్ మే 29 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట-బిసుగిరిషరీఫ్ రైల్వే స్టేషన్ల మధ్య జమ్మికుంట రైల్వే ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన కలకలం రేపింది. మృతురాలి వయసు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండవచ్చని అధికారులు తెలిపారు.

బహుశా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని లేదా ఇతర కారణాలతో మృతి చెందిన అవకాశం ఉందని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతురాలు మెరూన్ రంగు చుడిదార్ ధరించి ఉండగా, దానిపై నలుపు-తెలుపు డిజైన్ ఉన్నట్లు గుర్తించారు. ప్రమాద తీవ్రత కారణంగా మృతురాలి తల పూర్తిగా దెబ్బతినడంతో ముఖాన్ని గుర్తించడం సాధ్యం కాలేదని తెలిపారు. మృతురాలి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేదా ఇతర వస్తువులు లభించలేదని అధికారులు పేర్కొన్నారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ ఘటనపై ప్రభుత్వ రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జి. తిరుపతి, రామగుండం దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిసి ఉంటే 9949304574, 8712658604 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# భగీరథ్‌కు జైలు రిమాండ్

**హైదరాబాద్, మే 29 (తెలంగాణ ముచ్చట్లు):** మైనర్ బాలికను లైంగికంగా వేధించారనే ఆరోపణలతో నమోదైన పోక్సో కేసులో అరెస్టైన భగీరథ్ పోలీసు కస్టడీ ముగిసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆయనను మూడు రోజుల పాటు తమ కస్టడీలో ఉంచి విచారించారు. కస్టడీ గడువు పూర్తికావడంతో భగీరథ్‌ను కోర్టులో హాజరుపరిచారు. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆయనను చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ కేసు విచారణను ప్రత్యేక దర్యాప్తు బృందం పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో భగీరథ్‌ను పలు కోణాల్లో ప్రశ్నించినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన పరిస్థితులు, ఆరోపణలు, సంఘటనల క్రమంపై వివరాలు సేకరించేందుకు అధికారులు ప్రత్యేకంగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించేందుకు భగీరథ్‌ను మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌కు కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. అక్కడ జరిగినట్లు ఆరోపణలు ఉన్న సంఘటనలపై ఆధారాలు, పరిస్థితులను పరిశీలిస్తూ పోలీసులు విచారణ కొనసాగించారు. కేసులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, గత ఏడాది డిసెంబర్ 31న తన కుమార్తెను భగీరథ్ తన స్నేహితులతో కలిసి ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదైనప్పటి నుంచి పలు ఆధారాలను సేకరిస్తూ విచారణ కొనసాగిస్తున్నారు. పోలీసు కస్టడీ సమయంలో భగీరథ్‌ను అనేక ప్రశ్నలు అడిగినప్పటికీ కొన్ని ప్రశ్నలకు ఆయన సమాధానం ఇవ్వలేదని, మౌనంగా ఉన్నట్లు సమాచారం వెలువడింది. అయితే ఈ విషయంపై పోలీసులు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించలేదు. దర్యాప్తుకు సంబంధించిన అంశాలను గోప్యంగా ఉంచుతూ తదుపరి చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మైనర్‌కు సంబంధించిన కేసు కావడంతో పోలీసులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. దర్యాప్తులో లభించే ఆధారాలు, సాక్ష్యాల ఆధారంగా తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి నిజానిజాలు కోర్టు విచారణలో తేలనున్నాయి.

# ఉద్యోగుల ఆరోగ్యానికి సింగరేణి ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

వ్యాయామ సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్టేడియంలో అందుబాటులో ఉన్న క్రీడా మైదానాలు, వ్యాయామ పరికరాలు, నడక మార్గాలు, ఇతర ఆరోగ్య సంబంధిత సౌకర్యాలను సీఎండీ పరిశీలించారు. ఉద్యోగులు తమ విధులతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం, క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారని, అందువల్ల వారి శారీరక సామర్థ్యం, మానసిక స్థైర్యం ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటే సంస్థ పనితీరు కూడా మరింత మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రతి ఉద్యోగి జీవితంలో భాగం కావాలని సూచించారు. అన్ని ఏరియాల్లో క్రీడా సదుపాయాలను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఈ సౌకర్యాలను వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా సమానంగా ముఖ్యమని సీఎండీ తెలిపారు. ఒత్తిడిని తగ్గించే కార్యక్రమాలు, యోగా, ధ్యానం, ఫిట్‌నెస్ కార్యకలాపాలను ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమమే సంస్థ అభివృద్ధికి పునాది అని ఆయన అన్నారు. అందుకే ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమం కోసం ఇప్పటికే అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని అధికారులు తెలిపారు. క్రీడలు, ఆరోగ్యం, వినోదం, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన సదుపాయాలను మరింత విస్తరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా పనిచేసే వాతావరణం కల్పించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


## మనిగిళ్లలో ఉచిత వైద్య శిబిరం ప్రజల్లో విశేష స్పందన



**పెద్దమందడి,మే29(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మనిగిళ్ల గ్రామంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది.ముఖ్యంగా క్షయ, ఉబ్బసం మరియు ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల నిర్ధారణ కోసం నిర్వహించిన వైద్య పరీక్షల్లో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.అలాగే గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, జిల్లా వైద్యశాఖ అధికారులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సేవలందించారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్. రాములు, పోతుల రాంరెడ్డి, బండలయ్య, ప్రతాప్ రెడ్డి, ఎం. బుచ్చన్న, ఎస్. వెంకటయ్య, బోయిని కృష్ణయ్య, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు ఆరోగ్య సేవలు అందించిన జిల్లా వైద్యశాఖ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మహిళా సంక్షేమానికి పెద్దపీట



- **సత్తుపల్లిలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ.**

**సత్తుపల్లి, మే 29 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం సత్తుపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పేద కుటుంబాలకు చెందిన మహిళలకు "ఇందిరా మహిళా శక్తి" చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ నరసింహ, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ చైర్మన్ రెహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, కౌన్సిలర్లు తోట సుజాల రాణి, విరివాడ అపర్ణ, దేవ జ్యోతి, కర్నాటి విజయలక్ష్మి, ఉప్పు నాగమణి, నసీమ షరీఫ్ పాల్గొన్నారు.

## వనపర్తిలో 31న బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ భారీ బహిరంగ సభ




- **సామాజిక న్యాయం – రాజ్యాధికారమే లక్ష్యం**

**వనపర్తి, మే 29 (తెలంగాణ ముచ్చట్లు):-** వనపర్తి జిల్లా కేంద్రంలో ఈనెల 31న బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు జేఏసీ జిల్లా కన్వీనర్లు చిలుక బాలరాజ్ సాగర్, వీరపాగ రామకృష్ణ తెలిపారు. ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో సామాజిక న్యాయం - రాజ్యాధికారం నినాదంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో సాయంత్రం 4 గంటలకు సభ జరగనుందని పేర్కొన్నారు.ఎవరి కులం ఎంతో - వారికంత వాటా అనే ప్రధాన నినాదంతో నిర్వహించే ఈ సభకు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ హాజరుకానున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రాంతంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న అగ్రవర్ణ భూస్వామ్య వ్యవస్థ కారణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు తీవ్ర దోపిడీకి గురయ్యాయని నాయకులు ఆరోపించారు. జనాభాలో 90 శాతం ఉన్నప్పటికీ ఈ వర్గాలు బానిసలుగా, పేదరికంలోనే జీవించాల్సి వస్తోందన్నారు.భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత కొంత మార్పు వచ్చినప్పటికీ అది సరిపోదని పేర్కొన్నారు.సామాజిక న్యాయం సాధించాలంటే రాజకీయ భాకంపం అవసరమని, బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికార పోరాటం మరింత బలపడాలని పిలుపునిచ్చారు. మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, కాన్షీరాం ఆశయాలకు అనుగుణంగా బహుజన రాజ్యం స్థాపన కోసం ప్రజలు ముందుకు రావాలన్నారు.ఈ సభకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు, విద్యావంతులు, మేధావులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొనాలని జేఏసీ నాయకులు అశోక్, కురుమన్న, కొండన్న యాదవ్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి



**హుజురాబాద్, మే 29 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా హుజురాబాద్, జమ్మికుంట పట్టణాలతో పాటు వీణవంక, ఇల్లంతకుంట, కమలాపూర్ మండలాల్లో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వేసవి ప్రభావంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రతి గ్రామం, ప్రతి కాలనీలో సక్రమంగా తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని కోరారు.

దళితబంధు పథకం రెండో విడతను త్వరితగతిన ప్రారంభించి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

అలాగే వీణవంక మండల కేంద్రంలోని డబుల్ రోడ్డు, రాచపల్లి రోడ్డు, పోతిరెడ్డిపల్లి రోడ్డు, కోర్కల్ రోడ్డు, నాగంపేట రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. రోడ్ల దుస్థితి కారణంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

రైతులు పండించిన మక్కజొన్న కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి నిజమైన అర్హులైన పేద కుటుంబాలకు అందజేయాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. హుజురాబాద్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలను కూడా కలెక్టర్‌కు వివరించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# వందేళ్లు జీవించి... వెయ్యేళ్లు వర్ధిల్లండి...

- **ఉత్సవంలా పులిపాటి దంపతుల జన్మదినోత్సవం**
- **కేక్ కటింగ్‌లు, అన్నదానాలు, చీరల పంపిణీ, పండ్ల పంపిణీతో ఖమ్మంలో సంబరాలు**
- **కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ అర్బన్ డీసీసీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి**



**ఖమ్మం బ్యూరో , మే 29(తెలంగాణ ముచ్చట్లు ):**ఖమ్మం నగరంలో ప్రముఖ విద్యావేత్త, సామాజిక సేవకుడు డాక్టర్ పులిపాటి ప్రసాద్ మరియు పద్మప్రియ దంపతుల జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించబడ్డాయి. నగరంలోని ఖమ్మం పౌరసమితి ప్రధాన కార్యాలయం, స్టేషన్ రోడ్డులోని డాక్టర్ పులిపాటి ప్రసాద్ కాంప్లెక్స్ ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలు ఉత్సవ వాతావరణాన్ని తలపించాయి. భారీ కేక్ కటింగ్‌తో పాటు నిరుపేదలకు మహా అన్నదానం, మహిళలకు చీరల పంపిణీ, రోగులు మరియు ప్రజలకు పండ్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ ఖమ్మం అర్బన్ డీసీసీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ, ఒకే రోజు పులిపాటి ప్రసాద్ - పద్మప్రియ దంపతుల జన్మదినోత్సవం జరగడం అరుదైన విశేషమని అన్నారు. ప్రజాసేవ పట్ల అంకితభావంతో ముందుకు సాగుతున్న ఈ దంపతులు మరెన్నో జన్మదినోత్సవాలు జరుపుకుంటూ సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు.

లక్షలాది మంది విద్యార్థులకు నర్సింగ్ విద్యను అందిస్తూ, తెలంగాణ వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరింపజేస్తున్న డాక్టర్ పులిపాటి ప్రసాద్ సేవలు ప్రశంసనీయమని దీపక్ చౌదరి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

పులిపాటి దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ, నిరుపేదలకు పెద్దన్నయ్యగా, విద్యార్థులకు మార్గదర్శకులుగా, సమాజానికి సేవలందిస్తూ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షించారు. ఖమ్మం నగరంలో జరిగిన ఈ జన్మదిన వేడుకలు ప్రజల ఆదరణతో నిజమైన ప్రజా ఉత్సవంగా నిలిచాయి.

ఖమ్మంలో వేడుకలు ఘనంగా....

ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చేతుల మీదగా ది.12052008 న వాగ్దేవి విద్యా పురస్కారం అందుకున్న డా॥ పులిపాటి ప్రసాద్ జన్మదిన వేడుకలు అంబరాన్నంటాయి

ఉదయం 7 గంటలకు గొల్లగూడెం శంకర మఠం దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.. ఉదయం 8:30 గంటలకు శ్రీకృష్ణ గోశాలలో గోవులకు గోపూజ, గోగ్రాసం సమర్పణం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉదయం 8:30 గంటలకు రోగులకు పండ్ల పంపిణీ, స్టేషన్ రోడ్ లో పౌరసమితి కార్యాలయంలో భారీ కేక్ కటింగ్ కార్యక్రమా లు జరిగాయి..

11:00 నుంచి మధ్యాహ్నం 12:30 మధ్య స్టేషన్ రోడ్, డా॥ పులిపాటి ప్రసాద్ కాంప్లెక్స్లో మహా అన్నదానం,

పేదలకు వస్త్రదాన కార్యక్రమం, 7:00 డా॥ పులిపాటి ప్రసాద్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు సంబరంగా జరిగాయి. పేద విద్యార్థులు 11 మందికి ఉచిత విద్యా విరాళం కార్యక్రమం జరిగింది.

అతిథుల సందడి...

ఖమ్మం పౌర సమితి వ్యవస్థాపకులు పులిపాటి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పులిపాటి ప్రసాద్ పద్మప్రియ దంపతుల జన్మదిన వేడుకలు ఖమ్మం పులిపాటి కాంప్లెక్స్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం పౌర సమితి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి సీతచందర్రావు ఖమ్మం పౌర సమితి సభ్యులు హాజరైనారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.డాక్టర్ పులిపాటి ప్రసాద్ పద్మప్రియ దంపతుల జన్మదిన సందర్భంగా పులిపాటి కాంప్లెక్స్ వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం నగర అధ్యక్షులు నాగడ్ల దీపక్ చౌదరి చేతుల మీదుగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం పౌర సమితి నాయకులు గుమ్మడవెల్లి శ్రీనివాస్, పాల్వాయి వెంకటేశ్వర్లు, గోళ్ళ రాధాకృష్ణ మూర్తి, మాశెట్టి వరప్రసాద్, అపోవా కృష్ణ మూర్తి, కొదమూరు జగన్నాథం, కొంకిమళ్ళ మృత్యుంజయ గుప్త, సిద్ధంశెట్టి శ్రీకాంత్, బొగ్గవరపు సతీష్, కొదుమూరి భద్రయ్య, టి. సంతోష్ చక్రవర్తి,

చెరుకూరి రాజీ, కందిబండ భిక్షయ్య, ధనుంజయ, డి శ్రీనివాస్, పుల్లారావు, డోకుపర్తి సుబ్బారావు, వివి సుబ్బారావు, మాజీ కార్పొరేటర్ కూరాకుల వలరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నపూర్ణ, దామ స్వరూప, జ్యోతి, ప్రతిభ రెడ్డి, రామకృష్ణ, శ్రీకాంత్, కోసూరు ప్రసాద్, కోనేటి నారాయణ, పాలకుర్తి నాగేశ్వరరావు, బాణాల లక్ష్మణ్, పాల్వంచ రామారావు, పులిపాటి కళాశాల సిబ్బంది శ్రీకాంత్, నీరజ, ప్రతాప్, శ్వేత, సాయి శ్రీ, వసంత, లాల్ బీ తదితరులు పాల్గొన్నారు.



## బిజిగిరి షరీఫ్ దర్గాను అభివృద్ధి చేస్తాం : వొడితల ప్రణవ్

### ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని చాధర్ సమర్పణ

**జమ్మికుంట టౌన్ మే 29 (తెలంగాణ ముచ్చట్లు) :** జమ్మికుంట మండల పరిధిలోని బిజిగిరి షరీఫ్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. శుక్రవారం దర్గాను సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి చాధర్ సమర్పించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు ప్రణవ్‌కు ఘన స్వాగతం పలికారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు బిజిగిరి షరీఫ్ దర్గాకు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని తెలిపారు.

దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, దర్గాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అగ్నిప్రమాద ప్రాంతాలను పరిశీలించిన వొడితల ప్రణవ్

- **నష్టం అంచనా వేయాలని అధికారులకు ఆదేశాలు**

**జమ్మికుంట టౌన్ మే 29 (తెలంగాణ ముచ్చట్లు) :** ఇటీవల ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైన ప్రాంతాలను హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పరిశీలించారు. శుక్రవారం జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల, మడిపల్లి, అంకుశాపూర్ గ్రామాలతో పాటు కమలాపూర్ మండలంలోని అగ్నిప్రమాద ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించారు.

అగ్నిప్రమాదానికి గల కారణాలను అక్కడి గౌడ సోదరులు వివరించగా, సంఘటన జరిగిన వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చి నష్టం అంచనా వేయాలని సూచించినట్లు ప్రణవ్ తెలిపారు. అగ్నిప్రమాదంలో దగ్ధమైన తాటి చెట్లు, ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఈ సందర్భంగా రైతులు వరి కొయ్యలను కాల్చి పర్యావరణానికి హాని కలిగించొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సంఘటన స్థలం నుంచే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, వార్డ్ సభ్యులు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


## పుురుగుమందు తాగిన వ్యక్తికి 108 సిబ్బంది సకాల సాయం

- గౌరీగుడెంలో ఘటన.
- చికిత్స నిమిత్తం సత్తుపల్లి ఆసుపత్రికి తరలింపు.



**సత్తుపల్లి, మే 29 (తెలంగాణ ముచ్చ-ట్లు):** మండల పరిధిలోని గౌరీగుడెం గ్రామంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన కాసిని గాంధీ (43) పురుగుమందు సేవించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న 108 అత్యవసర సేవల సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించారు. అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుడు గొల్లమందల కృష్ణ, పైలట్ ఏకాంత్ అంబులెన్స్‌లో ఆక్సిజన్ అందిస్తూ, సెలైన్ ఎక్కిస్తూ సత్తుపల్లి ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించి బాధితుడిని ఆసుపత్రికి చేర్చిన 108 సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు. ఖమ్మం జిల్లా 108 మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్, మూడు జిల్లాల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న కార్యక్రమ నిర్వాహకుడు షేక్ నజీరుద్దీన్ సిబ్బంది సేవలను ప్రశంసించారు.

## నిరుపేద ఆటో డ్రైవర్ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం



**సిద్ధిపేట,మే29(తెలంగాణ ముచ్చట్లు):** సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని వరదరాజుల పల్లె (గుడికందుల) గ్రామానికి చెందిన నిరుపేద ఆటో డ్రైవర్ కుటుంబం నుంచి ఓ యువకుడు ప్రభుత్వ ఉద్యోగం సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు. గ్రామానికి చెందిన లక్ష్మీ, ముకుందం దంపతుల పెద్ద కుమారుడు నితిన్ ఇటీవల తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహించిన ఉద్యోగ నియామకాల్లో మెకానికల్ సూపర్‌వైజర్ శిక్షణార్థిగా ఎంపికయ్యాడు.నలుగురు సంతానంలో పెద్దవాడైన నితిన్ చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి కనబరిచాడు. నిర్మల్ జిల్లా కడ్తాల్ ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించిన ఆయన, అనంతరం గజ్వేల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యను కొనసాగించాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా లక్ష్యాన్ని విడిచిపెట్టకుండా పోటీ పరీక్షలకు సిద్ధమై ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాడు.సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన నితిన్ కృషి, పట్టుదలతో ఉద్యోగం సాధించడం గ్రామ యువతకు స్ఫూర్తిదాయకమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నితిన్‌ను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## వడ్డే కొండయ్య జ్ఞాపకార్థంగా దేవాలయానికి ఐమాక్స్ లైట్ డొనేషన్



**పెద్దమందడి,మే29(తెలంగాణ ము-చ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలోని శ్రీ సిద్ధి రామలింగేశ్వర స్వామి దేవాలయానికి వడ్డే కొండయ్య జ్ఞాపకార్థంగా వారి కుమారుడు వడ్డే శ్రీనివాస్ ఐమాక్స్ లైట్‌ను డొనేషన్‌గా అందజేశారు. దేవాలయంలో భక్తులకు మరింత ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని సమర్పించినట్లు ఐమాక్స్ లైట్ దాత శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు శివకుమార్ స్వామి మాట్లాడుతూ...వడ్డే కొండయ్య సేవాభావం కలిగిన వ్యక్తి అని, వారి జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు చేసిన ఈ సేవ అభినందనీయమన్నారు.దేవాలయ అభివృద్ధికి భక్తులు ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు.అలాగే వడ్డే శ్రీనివాస్ కుటుంబ సభ్యులందరికీ శ్రీ సిద్ధి రామలింగేశ్వర స్వామివారి సంపూర్ణ అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని అర్చకులు ఆశీర్వదించారు .ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో రోడ్డు ప్రమాదం.. వృద్ధురాలికి తీవ్ర గాయాలు

- మద్యం మత్తులో బైక్ నడిపిన వ్యక్తిపై కేసు నమోదు

**జమ్మికుంట టౌన్ మే 29 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన అవిరినేని సంపత్ రావు తన తల్లి లక్ష్మికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో తన అన్న రవీందర్‌రావుతో కలిసి బుధవారం ఉదయం జమ్మికుంటలోని దుర్గా హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. వైద్య పరీక్షలు పూర్తయ్యాక తిరిగి ఇంటికి వెళ్తుండగా జమ్మికుంట పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా వచ్చిన నెంబర్ ప్లేట్ లేని బైక్ ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బైక్ నడిపిన వ్యక్తి మద్యం సేవించి అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదంలో రవీందర్‌రావుకు స్వల్ప గాయాలు కాగా, లక్ష్మికి రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో పాటు ఒక కాలు విరిగినట్లు తెలిపారు. బాధితురాలిని మొదట దుర్గా హాస్పిటల్‌కు తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం హనుమకొండలోని శరణ్య హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం ప్రమాదానికి కారణమైన వ్యక్తి మాచినపల్లి గ్రామానికి చెందిన పర్లపల్లి కుమార్‌గా గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు ఆసుపత్రిలో ఉండటంతో ఫిర్యాదు ఇవ్వడం ఆలస్యమైందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

# పేదలను కాదని సంపన్నులకు అప్పగిస్తారా...?

- ఎన్నెస్పి ఆక్రమణలను తొలగించకుంటే ఆందోళన
- గ్రీన్బెల్ట్ ఏర్పాటు ఏమైంది...?
- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్
- ఆక్రమణలను పరిశీలించిన సిపిఐ బృందం



**ఖమ్మం బ్యూరో,మే 29(తెలంగాణ ముచ్చ-ట్లు ):** నిలువ నీడ లేక ఎన్నెస్పి కాలువ కట్టలపై గుడిసెలు వేసుకుంటే బలవంతంగా తొలగించిన రెవెన్యూ, పోలీస్ అధికారులు సంపన్నులు అక్రమిస్తే ఎందుకు నోరెత్తడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. పేదలకు ఒక రీతి, సంపన్నులకు మరో రీతిగా చట్టంలో రాసి ఉందా అని అలా ఉంటే అధికారులు వెంటనే స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలోని ఎన్నెస్పి స్థలాల ఆక్రమిత ప్రాంతాలలో సిపిఐ బృందం పర్యటించింది. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రదేశాల్లో యధేచ్ఛగా నిర్మాణాలు జరుగుతుండటాన్ని పరిశీలించారు. అధికారులు, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, రాజకీయ నాయకులే ఈ ఆక్రమణ దారుల్లో ఉన్నారని సురేష్ తెలిపారు. పేదల గుడిసెలను తొలగించేందుకు న్యాయస్థానాలను ఆశ్రయించి నిర్దాక్షణ్యంగా ఎన్నెస్పి కాలువ కట్టలపై పేదల గుడిసెలను తొలగింపజేసిన రాజకీయ నాయకులే ఇప్పుడు స్థలాలను ఆక్రమించి షెడ్లు వేయడం శోచనీయమన్నారు. ఎన్నెస్పి మేజర్ 2లో 66 అడుగుల వెడల్పున నాగార్జున సాగర్ కాలువ ఉన్నట్లు అధికారులు ధృవీకరించారని 12వ డివిజన్లో అష్టలక్ష్మి దేవాలయం ముందు భాగంలో ఓ వ్యాపారితో మొదలైన ఆక్రమణ గొల్లగూడెం రోడ్డు వెంబడి యధేచ్ఛగా సాగుతుందన్నారు. ఇప్పటికే కొందరు తమ నిర్మాణాలను పూర్తి చేయగా మరి కొందరు గతంలో ప్రభుత్వం వేసిన ఫెన్సింగ్లను తొలగించి ఆక్రమణలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని సురేష్ తెలిపారు. కొందరు రాజకీయ నాయకులు ప్రోద్బలంతోనే ఇది జరుగుతుందని ఇందులో కొందరు కేవలం స్థలాల ఆక్రమణ కోసమే పార్టీలు మారారని సురేష్ ఆరోపించారు. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయకపోగా ఆక్రమణలను పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణలను తొలగించకపోతే తిరిగి పేదల చేత ఈ స్థలాలను ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేస్తామని సురేష్ హెచ్చరించారు. అధికార పార్టీకి చెందిన కొందరి ప్రోద్బలమే ఈ ఆక్రమణలకు కారణమని ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయాన్ని గుర్తెరిగి తగు చర్యలు తీసుకోవాలని సురేష్ డిమాండ్ చేశారు. పరిశీలిన బృందంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి.. రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, సిపిఐ నాయకులు ఉపేందర్, నర్సింహారావు, సైదులు, మదూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆశలన్నీ అగ్నికి ఆహుతి రైతు విద్యాసాగర్‌కు తక్షణ సాయం అవసరం

- బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్





**ఎల్కతుర్తి, మే 29 (తెలంగాణ ముచ్చట్లు-):** ఎల్కతుర్తి మండలం అరెపల్లి గ్రామానికి చెందిన రైతు మాటూరి విద్యాసాగర్ గత 20 సంవత్సరాలుగా ఎంతో శ్రమించి పెంచుకున్న టేకువనం అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమవడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. భవిష్యత్తులో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఆశతో చెట్టు చెట్టును కాపాడుకుంటూ పెంచిన వందలాది టేకు చెట్లు క్షణాల్లో మంటల్లో కాలిపోవడం గ్రామస్థులను కలిచివేసింది.

స్థానికుల సమాచారం మేరకు ఒక్కసారిగా మంటలు చెలరేగి గాలివాన కారణంగా వేగంగా వ్యాపించడంతో పెద్ద ఎత్తున టేకువనం దగ్ధమైంది. గ్రామస్తులు, స్థానిక యువకులు కలిసి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే భారీ నష్టం సంభవించినట్లు తెలిసింది. ఈ ఘటనలో లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు.

ఈ ఘటనపై స్పందించిన బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ రైతు మాటూరి విద్యాసాగర్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. 20 సంవత్సరాల పాటు కష్టపడి పెంచిన టేకువనం ఒక్కసారిగా బూడిద కావడం అత్యంత బాధాకరమన్నారు. రైతు తన కుటుంబ భవిష్యత్తుతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం కూడా ఎంతో సేవ చేశారని కొనియాడారు. టేకు చెట్ల పెంపకం అనేది ఎంతో సహనం, సమయం, పెట్టుబడి అవసరమయ్యే పని అని పేర్కొన్న ఆయన, ఇలాంటి రైతులను ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహించాలని కోరారు. చెట్ల పెంపకానికి రైతులు ముందుకు వచ్చేలా భద్రతా చర్యలు, బీమా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్, అటవీ శాఖ అధికారులు వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శించి పూర్తి స్థాయిలో నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. రైతు మాటూరి విద్యాసాగర్‌కు ప్రత్యేక నష్టపరిహారం ప్రకటించి, తిరిగి టేకు మొక్కల పెంపకానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. “చెట్టు చెట్టుగా పెంచుకున్న ఆశలన్నీ అగ్నికి ఆహుతి అయ్యాయి” అంటూ రైతు విద్యాసాగర్ ఆవేదన వ్యక్తం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బిజిగిరీషరీఫ్ దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**జమ్మికుంట టౌన్ మే 29 (తెలంగాణ ము-చ్చట్లు):** జమ్మికుంట మండలం బిజిగిరీషరీఫ్ దర్గాను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా మత పెద్దలు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

దర్గా ప్రాంగణంలో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే అక్కడి పరిస్థితులను పరిశీలించి భక్తులకు అవసరమైన సౌకర్యాలపై మత పెద్దలతో చర్చించారు. బిజిగిరీషరీఫ్ దర్గా ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన స్థలమని పేర్కొన్న ఆయన, దర్గా అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అన్ని మతాల పట్ల గౌరవ భావనతో ముందుకు సాగడం సమాజానికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా దర్గాలో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మత పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ త్యాగాలను మరువలేం

- మేకల రాజకుమారి



**ఎల్కతుర్తి, మే 29 (తెలంగాణ ముచ్చట్లు-):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహిళా మండల కమిటీ ఎన్నికలు శుక్రవారం ఎల్కతుర్తి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి నిమ్మల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న మహిళా ఉద్యమకారులను గుర్తించి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా మేకల రాజకుమారి, ప్రధాన కార్యదర్శిగా గుగులోతు కమలాబాయి, ఉపాధ్యక్షురాలిగా శిధిరం రాధమ్మ, సహాయ కార్యదర్శిగా ముద్రకోళ్ల శాంతమ్మ, కోశాధికారిగా మేకల భాగ్య ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా గుండేటి శ్రీలత, పోతురబోయిన వజ్రమ్మ, పోతురబోయిన విజ్జమ్మలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మండల అధ్యక్షురాలు మేకల రాజకుమారి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. తొలి దశ ఉద్యమం నుంచి 2014 వరకు వేలాది మంది ఉద్యమకారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కొంతమంది ప్రాణత్యాగాలు కూడా చేశారని గుర్తు చేశారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి కార్యకర్తకు గుర్తింపు రావాలని, వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా ఫోరం కృషి చేస్తుందని తెలిపారు. అలాగే ఈ నెల 31న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న రాష్ట్ర ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులందరూ పెద్ద సంఖ్యలో హాజరై ఉద్యమ స్ఫూర్తిని చాటాలని కోరారు.ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యమకారులు, ఫోరం నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# యశోద హాస్పిటల్ లో గ్యాస్టిక్ క్యాన్సర్ కు అరుదైన శాస్త్ర చికిత్స




**ఖమ్మం బ్యూరో, మే 29(తెలంగాణ ము-చ్చట్లు):** యశోద మెడికల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ డాక్టర్ లాపరోస్కోపిక్ మరియు రోబోటిక్ సర్జన్ వై శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఇటీవలే ఖమ్మం ప్రాంతానికి చెందిన ఒక పేషెంట్ పితాశయం క్యాన్సర్ తో యశోద హాస్పిటల్ ను సంప్రదిస్తే ఆమెకు లివర్ ఫంక్షన్ టెస్ట్ లు చేసి అడ్వాన్సు లాపరోస్కోపిక్ , రోబోటిక్ సర్జరీ తో అరుదైన శాస్త్ర చికిత్స అందించామని పేర్కొన్నారు . గాలి బ్లాడర్ లో ఎక్కువ రోజులు స్టోన్స్ పెట్టుకున్న ఈ సమస్య వస్తుందని అన్నారు . ఈరోజుల్లో గ్యాస్టిక్ క్యాన్సర్లు చాలా ఎక్కువగా ఉన్నాయని , సమయానికి ఆహారం తీసుకోకపోవడం వల్ల , జంక్ ఫుడ్ , సిగరెట్స్ మద్యపానం మరి కొంతమందికి వారస్వతంగా ఆడవాళ్లకు మగవాళ్లకు అందరికీ వస్తుందని తెలిపారు . వారసత్వంగా వచ్చే క్యాన్సర్లు ఈ జనరేషన్ వాళ్ళు కూడా వచ్చే అవకాశలు ఎక్కువ ఉన్నాయి . తక్కువ వయసు వాళ్లకు కూడా వస్తాయి . కొంతమంది ఫాస్టింగ్ చేసి వెయిట్ లాస్ అయ్యే వాళ్లకు మరియు ఫ్యామిలీ హిస్టరీ ఉండేవాళ్లు ఎక్కువ అవకాశలు ఉన్నాయన్నారు . వాళ్ల పేరెంట్స్ కి ఎప్పుడైతే క్యాన్సర్ వచ్చిందో టెన్ ఇయర్స్ ముందే రెగ్యులర్ గా ఫాలోఅప్ చేసుకోవాలి . 5 ఇయర్స్ కి ఒకసారి ఎండోస్కోప్ , రెగ్గర్ అల్ట్రా సౌండ్ టెస్టులు చేయించుకుని ఫాలో అప్ చేసుకుంటే సింపుల్గా కంట్రోల్ చేసుకోవచ్చు . రెగ్యులర్ గా కడుపునొప్పి , బరువు తగ్గటం , ఆకలి లేకపోవడం , వాంతులు అవ్వడం లక్షణాలు ఉంటే అడ్వాన్స్ స్టేజ్ లో ఉన్నట్టు . వెంటనే సంబంధించిన డాక్టర్ ను సంప్రదించాలని అన్నారు . పేగు సర్జరీ చేస్తే మూడు నాలుగు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారు . మోస్ట్ డేంజర్ గాలి బ్లాడర్ క్యాన్సర్ . అవుట్ సైడ్ ఫుడ్ మ్యాగ్జిమం అవాయిడ్ చేయాలి . నిద్ర మంచిగుండాలి , ఎక్కువ స్టెయిన్ పడొద్దు మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండాలి . మన యశోద హాస్పిటల్ హైదరాబాద్ సోమాజిగూడ లో అడ్వాన్స్ కీమోథెరపీ , రేడియోథెరపీ మరియు అన్ని విధాల క్యాన్సర్లకు అతి తక్కువ ఖర్చుతో వైద్య సదుపాయం అందుబాటులో ఉంది అని అన్నారు . ఈ కార్యక్రమంలో శ్రీధర్ రావు , నాగార్జున , బాల కృష్ణ పాల్గొన్నారు .

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# కడుపు కాపాడితేనే ఆరోగ్యం



- **మారుతున్న ఆహారం.. పెరుగుతున్న జీర్ణ సమస్యలు**
- **ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి తెస్తున్న ప్రమాదాలు**
- **ఆరోగ్యకర జీవనశైలిపైనే భవిష్యత్తు**

మనిషి ఆరోగ్యానికి అసలు కేంద్రం గుండె కాదు, మెదడు కాదు.. కడుపే. శరీరానికి అవసరమైన శక్తి, పోషకాలు, రోగనిరోధక శక్తి అన్నీ జీర్ణవ్యవస్థ పనితీరుపైనే ఆధారపడి ఉంటాయి. అలాంటి జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కానీ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మారుతున్న జీవనశైలి చూస్తే పరిస్థితి ఆందోళనకరంగా కనిపిస్తోంది. ఒకప్పుడు పెద్దవారిలో మాత్రమే కనిపించిన అజీర్ణం, ఫ్యాటీ లివర్, గ్యాస్, అల్సర్లు వంటి సమస్యలు ఇప్పుడు చిన్న పిల్లల్లో కూడా కనిపించడం భయంకర వాస్తవంగా మారింది. రుచుల కోసం పరుగు తీస్తున్న సమాజం ఆరోగ్యాన్ని మాత్రం నెమ్మదిగా కోల్పోతోంది. ఇప్పటి జీవితం మొత్తం వేగంపైనే నడుస్తోంది. సమయం లేకుండా పని, ఒత్తిడి, బయట తిండి, రాత్రివేళల వరకు మేల్కొని ఉండటం సాధారణంగా మారిపోయాయి. ఇంటి వంటల కంటే ఫాస్ట్ ఫుడ్, నూనె పదార్థాలు, శీతల పానీయాలు, ప్రాసెస్డ్ ఆహారాలు ఎక్కువగా తీసుకుంటున్నారు. ఫలితంగా జీర్ణవ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోంది. తినే సమయాలు లేకుండా, ఆకలి లేకపోయినా తినడం, ఆకలిగా ఉన్నా ఆహారం మానేయడం వంటి అలవాట్లు శరీరాన్ని లోపల నుంచి బలహీనపరుస్తున్నాయి. ముఖ్యంగా యువతలో గ్యాస్, మలబద్ధకం, అజీర్ణం, లివర్ సమస్యలు వేగంగా పెరుగుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే పిల్లల్లో కూడా జీర్ణ సంబంధిత సమస్యలు పెరుగుతుండటం. మొబైల్ ఫోన్లు, టీవీలు చూస్తూ గంటల తరబడి కూర్చోవడం, బయట జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, శారీరక వ్యాయామం తగ్గిపోవడం పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. చిన్న వయసులోనే ఊబకాయం, ఫ్యాటీ లివర్, జీర్ణ సమస్యలు కనిపించడం భవిష్యత్తుకు ప్రమాద సంకేతంగా మారుతోంది. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం కడుపు నిండితే సరిపోదు.. శరీరానికి ఉపయోగపడే ఆహారం తినడం కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గుర్తించాల్సిన సమయం వచ్చింది. జీర్ణవ్యవస్థ బాగాలేకపోతే దాని ప్రభావం మొత్తం శరీరంపైనే పడుతుంది. అలసట, చిరాకు, నిద్రలేమి, బలహీనత, మానసిక ఒత్తిడి వంటి అనేక సమస్యలకు ఇది కారణమవుతోంది. ప్రస్తుతం చాలామంది ఆరోగ్య సమస్యలను చిన్నచూపు చూస్తున్నారు. కడుపులో మంట, అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యలను సాధారణంగా తీసుకుంటూ నిర్లక్ష్యం చేస్తున్నారు. కానీ అవే తర్వాత పెద్ద వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చిన తర్వాత ఆస్పత్రుల చుట్టూ తిరగడం కంటే ముందుగానే జీవనశైలిని మార్చుకోవడం మంచిదని సూచిస్తున్నారు. మన పాత ఆహారపు అలవాట్లు ఇప్పుడు మళ్లీ అవసరంగా మారుతున్నాయి. ఒకప్పుడు ఇంట్లో తయారయ్యే సాంప్రదాయ ఆహారం శరీరానికి అవసరమైన పోషకాలను అందించేది. కానీ ఇప్పుడు ఆహారం మొత్తం రుచులకే పరిమితమైపోయింది. చిరుధాన్యాలు, పచ్చి కూరగాయలు, పండ్లు, పెరుగు వంటి సహజ ఆహారాలను మానేసి బయట తిండిపై ఆధారపడటం ప్రమాదకరంగా మారుతోంది. ఆహారం విషయంలో నియంత్రణ లేకపోతే భవిష్యత్తులో మరిన్ని ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జీర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కేవలం మందులపైనే ఆధారపడటం సరిపోదు. సరైన ఆహారం, తగిన నిద్ర, ప్రతిరోజూ వ్యాయామం, ఒత్తిడిని తగ్గించుకోవడం వంటి అంశాలు కూడా చాలా అవసరం. ఎక్కువగా నీరు తాగడం, సమయానికి భోజనం చేయడం, రాత్రివేళల్లో ఎక్కువగా తినకపోవడం వంటి చిన్న చిన్న మార్పులు కూడా పెద్ద ప్రయోజనాలను ఇస్తాయి. ముఖ్యంగా రోజుకు కొంత సమయం నడక, వ్యాయామానికి కేటాయిస్తే జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అంటే ఖరీదైన మందులు కాదు.. మంచి అలవాట్లేనని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం సమాజం మొత్తం ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమాలు, ప్రకటనలు చూపిస్తున్న ఆకర్షణీయ ఆహారాల వెనుక దాగి ఉన్న ప్రమాదాలను గుర్తించాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు నేర్పించాలి. పాఠశాలలు, కుటుంబాలు, ప్రభుత్వాలు కలిసి ప్రజల్లో జీర్ణ ఆరోగ్యంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా కడుపు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే భావన ప్రతి ఒక్కరిలో రావాలి. ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవం కేవలం ఒక దినోత్సవంగా మిగలకూడదు. మన జీవనశైలిని ఒకసారి పరిశీలించుకునే అవకాశంగా తీసుకోవాలి. రుచుల కోసం ఆరోగ్యాన్ని త్యాగం చేసే పరిస్థితి నుంచి బయటపడాలి. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేది మందులు కాదు.. సరైన ఆహారం, క్రమశిక్షణ, మంచి జీవనశైలి అనే విషయాన్ని సమాజం గుర్తించాల్సిన సమయం వచ్చింది. కడుపు బాగుంటేనే మనిషి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించగలడనే నిజాన్ని ఈ దినోత్సవం మరోసారి గుర్తు చేస్తోంది. సామాజిక మాధ్యమాలు, ప్రకటనలు చూపిస్తున్న ఆకర్షణీయ ఆహారాల వెనుక దాగి ఉన్న ప్రమాదాలను గుర్తించాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు నేర్పించాలి. పాఠశాలలు, కుటుంబాలు, ప్రభుత్వాలు కలిసి ప్రజల్లో జీర్ణ ఆరోగ్యంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా కడుపు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే భావన ప్రతి ఒక్కరిలో రావాలి. ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవం కేవలం ఒక దినోత్సవంగా మిగలకూడదు. మన జీవనశైలిని ఒకసారి పరిశీలించుకునే అవకాశంగా తీసుకోవాలి. రుచుల కోసం ఆరోగ్యాన్ని త్యాగం చేసే పరిస్థితి నుంచి బయటపడాలి. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేది మందులు కాదు.. సరైన ఆహారం, క్రమశిక్షణ, మంచి జీవనశైలి అనే విషయాన్ని సమాజం గుర్తించాల్సిన సమయం వచ్చింది. కడుపు బాగుంటేనే మనిషి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించగలడనే నిజాన్ని ఈ దినోత్సవం మరోసారి గుర్తు చేస్తోంది.



# పాత బట్టలతో ఇల్లు తుడవచ్చా?

## ఖర్చు తగ్గించే సులభ మార్గం
## సరైన బట్టలు ఎంచుకోవడం ముఖ్యం
## శుభ్రతలో జాగ్రత్తలు అవసరం

ఇంట్లో పాతబడిన బట్టలను చాలామంది శుభ్రపరిచే పనులకు ఉపయోగిస్తుంటారు. ముఖ్యంగా నేల తుడవడం, ఫర్నిచర్ శుభ్రం చేయడం, కిటికీలు తుడవడం వంటి పనుల్లో పాత గుడ్డలు ఉపయోగించడం సాధారణంగా కనిపించే విషయం. ఇలా చేయడం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా ఉపయోగం లేని బట్టలకు మరో ఉపయోగం లభిస్తుంది. అయితే ఏ బట్టలైనా వాడకుండా కొన్ని జాగ్రత్తలు పాటించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. పాత కాటన్ బట్టలు ఇంటి శుభ్రత పనులకు బాగా ఉపయోగపడతాయి. ఇవి నీటిని త్వరగా పీల్చుకోవడంతో పాటు దుమ్మును సులభంగా తొలగిస్తాయి. టీ షర్టులు, పాత చీరలు, తువ్వాళ్లు వంటి బట్టలను చిన్న ముక్కలుగా కట్ చేసి ఉపయోగిస్తే మరింత సౌకర్యంగా ఉంటుంది. మృదువైన బట్టలు ఫర్నిచర్‌పై గీతలు పడకుండా కూడా కాపాడుతాయి. అయితే చాలా మురికిగా ఉన్న లేదా చెడు వాసన వచ్చే బట్టలను ఉపయోగించకూడదు. అలాంటి బట్టల్లో బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వంటగది, పిల్లలు ఉండే గదులు శుభ్రం చేసే సమయంలో పరిశుభ్రమైన గుడ్డలు మాత్రమే వాడాలి. ఒకసారి ఉపయోగించిన తర్వాత బట్టలను శుభ్రంగా కడిగి ఎండలో ఆరబెట్టడం మంచిది. రసాయన క్లీనర్లతో కలిసి ఉపయోగించే సమయంలో కూడా జాగ్రత్త అవసరం. కొన్నిసార్లు బలమైన కెమికల్స్ వల్ల బట్టలు త్వరగా పాడవుతాయి. చేతులకు ఇబ్బంది కలగకుండా గ్లోవ్స్ ధరించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. శుభ్రత కోసం వాడే బట్టలను ఇతర బట్టలతో కలపకుండా వేరుగా ఉంచడం కూడా అవసరం. పాత బట్టలను సరైన విధంగా వినియోగిస్తే అవి ఇంటి పనుల్లో ఎంతో ఉపయోగపడతాయి. పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది చిన్న సహాయంగా నిలుస్తుంది. ఉపయోగం లేని వస్తువులను మళ్లీ ఉపయోగించడం ద్వారా డబ్బు ఆదా కావడంతో పాటు ఇంటి శుభ్రతను కూడా సులభంగా నిర్వహించుకోవచ్చు.



# అలసందల ఆరోగ్య రహస్యం



**పోషకాలతో నిండిన అలసందలు**

**గుండె ఆరోగ్యానికి మేలు**

**బరువు తగ్గాలనుకునేవారికి మంచి ఆహారం**

తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా ఉపయోగించే పప్పుధాన్యాలలో అలసందలు ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఈ ఆహారం గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు పట్టణాల్లో కూడా ఆదరణ పొందుతోంది. అలసందలతో కూరలు, గుగ్గిళ్లు, పులుసులు తయారు చేసుకుని తింటారు. రుచికరంగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి కూడా ఇవి ఎంతో మేలు చేస్తాయని ఆహార నిపుణులు చెబుతున్నారు. అలసందల్లో ప్రోటీన్లు, పీచు పదార్థాలు, ఇనుము, కాల్షియం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. శరీరానికి శక్తిని అందించడంలో ఇవి సహాయపడతాయి. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులకు అలసందలు మంచి పోషకాహారంగా ఉపయోగపడతాయని వైద్యులు సూచిస్తున్నారు. రక్తహీనత సమస్యను తగ్గించడంలో కూడా ఇవి ఉపయోగకరమని చెబుతున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో అలసందలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే పీచు పదార్థాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. రక్తపోటును నియంత్రించడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి. తరచూ అలసందలు తీసుకునే వారిలో గుండె సంబంధిత సమస్యల ప్రమాదం తక్కువగా ఉండే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గాలని భావించే వారికి కూడా అలసందలు మంచి ఆహారంగా పరిగణించబడుతున్నాయి. వీటిని తింటే ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. దీంతో అనవసరంగా ఎక్కువ ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా అలసందలు సహాయపడతాయి. అందుకే ఆరోగ్యకరమైన ఆహార పట్టికలో వీటికి ప్రత్యేక స్థానం ఇస్తున్నారు. ఆధునిక ఆహారపు అలవాట్ల మధ్య సంప్రదాయ ధాన్యాల ప్రాముఖ్యత మళ్లీ పెరుగుతోంది. సహజ పోషకాలతో నిండిన అలసందలను వారంలో కనీసం రెండు సార్లు ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. రుచిని, ఆరోగ్యాన్ని కలిపిన ఈ సంప్రదాయ ఆహారం ఆరోగ్యకర జీవనశైలికి మంచి ఎంపికగా నిలుస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# ట్రిలియన్ డాలర్ల దిశగా ఆంథ్రోపిక్.. ఏఐ రంగంలో కొత్త సంచలనం

ప్రపంచ టెక్నాలజీ రంగంలో ఇప్పుడు కృత్రిమ మేధ ఆధారిత సంస్థలదే హవా కొనసాగుతోంది. భవిష్యత్తు మొత్తం ఏఐ టెక్నాలజీ చుట్టూనే తిరుగుతుందనే నమ్మకంతో ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. ఈ క్రమంలో ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ మరోసారి వార్తల్లో నిలిచింది. తాజాగా చేపట్టిన భారీ నిధుల సమీకరణలో సంస్థ 65 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సేకరించగా.. దాంతో ఆ సంస్థ మార్కెట్ విలువ ఏకంగా 965 బిలియన్ డాలర్లకు చేరినట్లు అంతర్జాతీయ ఆర్థిక వర్గాలు వెల్లడించాయి. ఈ పెట్టుబడి రౌండ్‌లో ప్రపంచ ప్రఖ్యాత ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు ఆల్టిమీటర్ క్యాపిటల్, డ్రాగోనీర్, గ్రీనోక్స్, సెక్వోయా క్యాపిటల్ వంటి దిగ్గజాలు పాల్గొన్నాయి. ఒక్కో సంస్థ సుమారు రెండు బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం. ఏఐ రంగంలో భవిష్యత్తులో మరింత విస్తరణ అవకాశాలు ఉన్నాయని భావించిన ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రస్తుతం ప్రపంచ టెక్ మార్కెట్‌లో ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కలిగిన సంస్థల జాబితా రోజురోజుకూ పెరుగుతోంది. ఏఐ చిప్‌ల తయారీలో ప్రపంచ ఆధిపత్యం కొనసాగిస్తున్న ఎన్విడియా, సెర్చ్ దిగ్గజం ఆల్ఫాబెట్, టెక్ దిగ్గజం యాపిల్ సంస్థల మార్కెట్ విలువ ఇప్పటికే నాలుగు ట్రిలియన్ డాలర్లను దాటినట్లు మార్కెట్ డేటా చెబుతోంది. ఇక మైక్రోసాఫ్ట్ సుమారు 3.1 ట్రిలియన్ డాలర్లు, అమెజాన్ 2.8 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో దూసుకెళ్తున్నాయి.

ఇక ప్రపంచవ్యాప్తంగా ఏఐ విప్లవానికి ప్రతీకగా మారిన చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్ ఏఐ కూడా త్వరలో ఐపీఓకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆ సంస్థ మార్కెట్ విలువ 800 బిలియన్ నుంచి ట్రిలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. అయితే ఆంథ్రోపిక్ ఇప్పటికే 900 బిలియన్ డాలర్ల మార్కును దాటేయడంతో.. ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను అందుకునే తొలి ఏఐ స్టార్టప్‌గా నిలిచే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఏఐ ఆధారిత చాట్‌బాట్లు, ఆటోమేషన్, డేటా అనలిటిక్స్, కోడింగ్ టూల్స్, పరిశోధన రంగాల్లో భారీ డిమాండ్ పెరుగుతుండటంతో ఆంథ్రోపిక్ వంటి సంస్థలపై పెట్టుబడిదారుల విశ్వాసం మరింత బలపడుతోంది. ముఖ్యంగా సంస్థ అభివృద్ధి చేస్తున్న ఆధునిక ఏఐ మోడళ్లు, భద్రతా ప్రమాణాలు, కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్న సిస్టమ్‌లు మార్కెట్‌లో మంచి ఆదరణ పొందుతున్నాయని టెక్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్ కంపెనీల మధ్య ఏఐ ఆధిపత్య పోరు మరింత వేడెక్కుతోంది. ఈ పోటీలో భారీ పెట్టుబడులు, కొత్త మోడళ్లు, శక్తివంతమైన డేటా సెంటర్ల నిర్మాణం కీలకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆంథ్రోపిక్ సాధించిన తాజా మార్కెట్ విలువ ఇప్పుడు ప్రపంచ టెక్ రంగంలో హాట్ టాపిక్‌గా మారింది.




# భారత ఆర్థిక వ్యవస్థపై ఆర్‌బీఐ ధీమా..

అంతర్జాతీయ స్థాయిలో కొనసాగుతున్న ఆర్థిక అనిశ్చితులు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, వాతావరణ మార్పుల ప్రభావం వంటి సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ.. భారత ఆర్థిక వ్యవస్థ మౌలిక అంశాలు బలంగా ఉన్నాయని భారత రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేసింది. దేశీయ బ్యాంకింగ్ రంగం, కార్పొరేట్ రంగం స్థిరంగా ఉండటంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతుండటంతో దేశ ఆర్థికాభివృద్ధికి పెద్దగా ఇబ్బందులు ఉండబోవని ఆర్‌బీఐ తన తాజా వార్షిక నివేదికలో పేర్కొంది.శుక్రవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో ఆర్‌బీఐ పలు కీలక అంశాలను ప్రస్తావించింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు కొనసాగుతున్నప్పటికీ భారత్ అభివృద్ధి పథంలోనే ముందుకు సాగుతుందని అంచనా వేసింది. ముఖ్యంగా దేశీయ వినియోగం, మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరణ భారత వృద్ధికి కీలక బలంగా మారుతున్నాయని పేర్కొంది.ఆర్‌బీఐ నివేదిక ప్రకారం.. కార్పొరేట్ రంగం లాభదాయకంగా కొనసాగుతుండటం, బ్యాంకింగ్ రంగంలో నిరర్థక ఆస్తుల భారం తగ్గడం, రుణాల వృద్ధి స్థిరంగా ఉండటం దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు కూడా ఆర్థిక చక్రాన్ని ముందుకు నడిపిస్తున్నాయని తెలిపింది.అయితే ఈ ఏడాది ఆర్థికాభివృద్ధిపై అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉండే అవకాశం ఉందని ఆర్‌బీఐ హెచ్చరించింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు, ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే అవకాశముందని పేర్కొంది. ఈ కారణంగా ప్రపంచ ఆర్థికాభివృద్ధి కొంత మందగించే అవకాశం ఉన్నప్పటికీ.. భారత్‌పై దాని ప్రభావం పరిమితంగానే ఉండొచ్చని అంచనా వేసింది. భారత్ ఇతర దేశాలతో కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలు, సరఫరా గొలుసుల విస్తరణ, తయారీ రంగానికి లభిస్తున్న ప్రోత్సాహం వంటి అంశాలు దేశ ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు తీసుకురానున్నాయని నివేదికలో పేర్కొన్నారు. ప్రపంచ కంపెనీలు భారత్‌ను ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా చూడటం కూడా దేశానికి దీర్ఘకాలిక లాభాలను తీసుకురాగలదని విశ్లేషించింది. వ్యవసాయ రంగంపై కూడా ఆర్‌బీఐ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వ్యవసాయ ఉత్పాదకత కొంత తగ్గే అవకాశం ఉందని తెలిపింది. అయితే వానాకాలం రెండో దశలో హిందూ మహాసముద్ర పరిస్థితులు అనుకూలిస్తే ఎల్‌నినో ప్రభావం తగ్గవచ్చని అంచనా వేసింది. దేశంలో తగినంత ధాన్య నిల్వలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఉండటంతో ఆహార భద్రతపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని పేర్కొంది.పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా ఎరువులు, ముడి సరకుల ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని ఆర్‌బీఐ వెల్లడించింది. అయినప్పటికీ భారత్ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఎరువుల సరఫరాను కొనసాగిస్తున్నందున రైతులకు పెద్దగా ఇబ్బందులు ఉండకపోవచ్చని తెలిపింది. ద్రవ్యోల్బణం కూడా అదుపులోనే ఉండే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.

ఇక 2026 నుంచి 2031 మధ్య కాలంలో ద్రవ్యోల్బణాన్ని 4 శాతం పరిధిలో నిలబెట్టే లక్ష్యంతో ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తున్నాయని నివేదికలో వెల్లడించింది. అదే సమయంలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పథకాలను మరింత బలోపేతం చేయడంతో పాటు దేశీయ రిటైల్ రంగంలో డిజిటల్ కరెన్సీ వినియోగాన్ని విస్తరించే యోచనలో ఉన్నట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది.ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితులు కొనసాగుతున్న వేళ.. భారత ఆర్థిక వ్యవస్థపై ఆర్‌బీఐ వ్యక్తం చేసిన ఈ ధీమా ఇప్పుడు ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




# రాయల్ ఎన్ఫీల్డ్ నుంచి బుల్లెట్ 650 విడుదల..

భారతీయ ద్విచక్ర వాహన మార్కెట్లో ప్రత్యేకమైన క్రేజ్‌ను సొంతం చేసుకున్న ప్రముఖ బైక్ తయారీ సంస్థ రాయల్ ఎన్ఫీల్డ్ మరో సరికొత్త మోడల్‌తో బైక్ ప్రియులను ఆకట్టుకుంది. ఎంతోకాలంగా ఆటోమొబైల్ మార్కెట్లో చర్చనీయాంశంగా మారిన “బుల్లెట్ 650” మోడల్‌ను సంస్థ అధికారికంగా విడుదల చేసింది. క్లాసిక్ బుల్లెట్ స్టైల్‌కు ఆధునిక టెక్నాలజీ, పవర్‌ఫుల్ ఇంజిన్‌ను జోడిస్తూ రూపొందించిన ఈ బైక్ ఇప్పుడు 650సీసీ సెగ్మెంట్‌లో కొత్త ఆకర్షణగా మారింది. కంపెనీ ఈ బైక్ ప్రారంభ ధరను రూ.3.64 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా నిర్ణయించింది. క్లాసిక్ డిజైన్‌ను ఇష్టపడే రైడర్లతో పాటు లాంగ్ రైడ్స్, హైవే పర్ఫార్మెన్స్ కోరుకునే వారికి ఈ బైక్ ప్రత్యేక అనుభూతిని అందించనుందని కంపెనీ తెలిపింది. ఈ బుల్లెట్ 650లో 648సీసీ ప్యారలల్ ట్విన్ సిలిండర్ ఇంజిన్‌ను అమర్చారు. ఈ ఇంజిన్ గరిష్ఠంగా 47 హెచ్‌పీ పవర్‌తో పాటు 52.3 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సిటీ రైడింగ్‌తో పాటు హైవేల్లో కూడా స్మూత్ పర్ఫార్మెన్స్ అందించేలా ఇంజిన్‌ను ట్యూన్ చేసినట్లు కంపెనీ పేర్కొంది. ఆరు స్పీడ్ గేర్‌బాక్స్‌తో ఈ బైక్ మరింత మెరుగైన రైడింగ్ అనుభూతిని అందించనుంది. డిజైన్ విషయానికి వస్తే.. రాయల్ ఎన్ఫీల్డ్ తన సాంప్రదాయ రెట్రో స్టైలింగ్‌ను కొనసాగిస్తూ ఆధునిక ఫీచర్లను జోడించింది. పాత బుల్లెట్ మోడళ్లకు గుర్తుగా ఉండే ఫ్యూయల్ ట్యాంక్ డిజైన్, క్లాసిక్ బాడీ లైన్స్, మెటల్ ఫినిషింగ్ ఈ బైక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అదే సమయంలో నేటి తరం వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పలు మోడ్రన్ ఫీచర్లను కూడా అందించారు. రైడింగ్ సమయంలో గేర్ మార్పులను సాఫీగా చేయడానికి స్లిప్పర్ క్లచ్ సదుపాయాన్ని కల్పించారు. రాత్రి ప్రయాణాలకు అనుకూలంగా పవర్‌ఫుల్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌ను అమర్చారు. వింటేజ్ స్టైల్‌ను గుర్తు చేసే అల్యూమినియం స్విచ్ గేర్ ఈ బైక్‌కు ప్రీమియం లుక్‌ను తీసుకొచ్చింది. ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌లో అనలాగ్, డిజిటల్ డిస్‌ప్లేలను కలిపి రూపొందించారు. ఇందులో ఫ్యూయల్ లెవల్ ఇండికేటర్, గేర్ పొజిషన్ ఇండికేటర్, ట్రిప్ సమాచారం వంటి స్మార్ట్ ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి. రైడర్‌కు అవసరమైన అన్ని ముఖ్యమైన వివరాలు ఒకే స్క్రీన్‌పై కనిపించేలా డిజైన్ చేశారు. 650సీసీ సెగ్మెంట్‌లో ఇప్పటికే ఇంటర్‌సెప్టర్ 650, సూపర్ మీటియోర్ 650 వంటి మోడళ్లతో విజయవంతంగా దూసుకెళ్తున్న రాయల్ ఎన్ఫీల్డ్.. ఇప్పుడు బుల్లెట్ 650తో మరోసారి మార్కెట్లో తన ఆధిపత్యాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా క్లాసిక్ లుక్‌తో భారీ ఇంజిన్ పర్ఫార్మెన్స్ కోరుకునే యువతను ఈ బైక్ ఆకర్షించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆటోమొబైల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం భారత మార్కెట్లో ప్రీమియం మిడ్-సెగ్మెంట్ బైక్‌లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో బుల్లెట్ 650 విడుదల రాయల్ ఎన్ఫీల్డ్‌కు మరింత బలాన్నిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఎల్ఐసీ షేరు ధర సగం.. ఇన్వెస్టర్లలో కలకలం

దేశంలోని అతిపెద్ద బీమా సంస్థ “లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా” షేర్లు శుక్రవారం స్టాక్ మార్కెట్లో భారీగా పడిపోయినట్లు కనిపించడంతో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. బుధవారం ముగింపు ధర రూ.830 వద్ద ఉండగా.. శుక్రవారం ఉదయం ఎన్ఎస్ఈలో ఈ షేరు రూ.417.60 వద్ద ప్రారంభమైంది. దీంతో ఎల్ఐసీ షేరు ఒక్కరోజులోనే దాదాపు 50 శాతం కుప్పకూలిందా? అనే చర్చ మార్కెట్లో మొదలైంది. అయితే ఇది నిజమైన




పతనం కాదని.. సంస్థ ప్రకటించిన బోనస్ షేర్ల సర్దుబాటు ప్రభావమేనని మార్కెట్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వాస్తవానికి ఎల్ఐసీ షేరు కేవలం స్వల్ప నష్టంతోనే ట్రేడింగ్ ప్రారంభించిందని చెబుతున్నారు. ఎల్ఐసీ తన చరిత్రలో తొలిసారిగా ఇన్వెస్టర్లకు బోనస్ షేర్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఒక షేరుకు మరో షేరు ఉచితంగా ఇచ్చే విధంగా 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని సంస్థ గత ఏప్రిల్ నెలలోనే వెల్లడించింది. ఇందుకోసం మే 29ను రికార్డు తేదీగా నిర్ణయించారు. బోనస్ షేర్ల జారీ వల్ల కంపెనీ మొత్తం షేర్ల సంఖ్య రెట్టింపు అవుతుంది. అయితే కంపెనీ మొత్తం మార్కెట్ విలువలో మాత్రం ఎలాంటి మార్పు ఉండదు. మార్కెట్లో షేర్ల సంఖ్య పెరగడంతో ఒక్కో షేరు ధర ఆటోమేటిక్‌గా సగానికి తగ్గుతుంది. అందుకే ఎల్ఐసీ షేరు ధర ఒక్కసారిగా భారీగా పడిపోయినట్లు కనిపించిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఉదాహరణకు ఒక ఇన్వెస్టర్ వద్ద ముందుగా 10 షేర్లు ఉంటే.. బోనస్ తర్వాత అతనికి మరో 10 షేర్లు ఉచితంగా లభిస్తాయి. దీంతో మొత్తం 20 షేర్లు అవుతాయి. కానీ ఒక్కో షేరు ధర సగానికి తగ్గిపోవడంతో మొత్తం పెట్టుబడి విలువ మాత్రం మారదు.ఈ బోనస్ షేర్ల వల్ల ముఖ్యంగా చిన్న ఇన్వెస్టర్లకు ప్రయోజనం కలుగుతుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. షేరు ధర తక్కువ స్థాయికి రావడంతో సాధారణ ఇన్వెస్టర్లు కూడా సులభంగా కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల మార్కెట్లో షేర్ల కొనుగోలు, అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. బోనస్ షేర్లకు ఎవరు అర్హులు అనే అంశంపై కూడా ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొంది. మే 29 నాటికి ఎవరి డీమ్యాట్ ఖాతాలో ఎల్ఐసీ షేర్లు ఉంటాయో వారికే ఈ బోనస్ షేర్లు లభిస్తాయి. సెబీ నిబంధనల ప్రకారం రికార్డు తేదీకి ఒక రోజు ముందు షేర్లు కొనుగోలు చేసి ఉండాలి. అయితే ఈసారి బక్రీద్ సందర్భంగా గురువారం మార్కెట్లకు సెలవు ఉండటంతో.. బుధవారం నాటికే షేర్లు కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లకే ఈ బోనస్ షేర్లు దక్కనున్నాయి. 2022 మే నెలలో స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ అయిన ఎల్ఐసీ.. ప్రస్తుతం దేశంలో అత్యధిక ఇన్వెస్టర్లు కలిగిన ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటిగా కొనసాగుతోంది. 21 లక్షల మందికిపైగా షేర్ హోల్డర్లకు తొలిసారిగా బోనస్ షేర్లు ఇవ్వడం ఇప్పుడు మార్కెట్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

శనివారం - 30 - మే 2026



# మూడు నెలల్లో తీర్పు తప్పనిసరి



దేశంలోని హైకోర్టులు కేసుల విచారణ పూర్తయిన తర్వాత తీర్పును రిజర్వ్ చేసి దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచకుండా గరిష్టంగా మూడు నెలల్లోగా తుది తీర్పును వెల్లడించాలని సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తీర్పుల ఆలస్యం కారణంగా పిటిషనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, న్యాయం ఆలస్యమైతే దాని ప్రభావం ప్రజల హక్కులపై పడుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం వెలువడిన ఆదేశాలు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని హైకోర్టులకు వర్తిస్తాయని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి సభ్యులుగా ఉన్న ధర్మాసనం ఈ మార్గదర్శకాలను జారీ చేసింది. విచారణ పూర్తయిన తర్వాత తీర్పును రిజర్వ్ చేసిన తేదీ నుంచి గరిష్టంగా మూడు నెలల వ్యవధిలోనే తీర్పును ప్రకటించాలని స్పష్టంగా సూచించింది. ముఖ్యంగా వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన కేసుల్లో అంతకంటే ముందుగానే తీర్పు ఇవ్వాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది.

బెయిల్ దరఖాస్తులకు సంబంధించిన కేసుల్లో మరింత వేగంగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. బెయిల్ కేసులపై విచారణ ముగిసిన రోజే సాధ్యమైనంత వరకు తీర్పు వెల్లడించాలని, ఒకవేళ తీర్పును రిజర్వ్ చేయాల్సి వస్తే మరుసటి రోజుకే ఆదేశాలు వెలువడాలని పేర్కొంది. నిందితుల స్వేచ్ఛకు సంబంధించిన అంశాల్లో అనవసర జాప్యం ఉండకూడదని స్పష్టం చేసింది. బెయిల్ లేదా విడుదలకు సంబంధించిన ఆదేశాలు వెలువడిన వెంటనే వాటిని జైలు అధికారులకు త్వరితగతిన చేరవేయాలని కూడా సుప్రీంకోర్టు సూచించింది. బెయిల్ మంజూరైన వ్యక్తులు అన్ని విధానాలు పూర్తి చేసుకుని వీలైతే అదే రోజు విడుదల కావాలని, అది సాధ్యం కాకపోతే కనీసం మరుసటి రోజుకైనా విడుదల జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ విషయంలో పరిపాలనా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించింది.

కేవలం హైకోర్టులకే కాకుండా కింది స్థాయి కోర్టులు కూడా ఇదే విధానాన్ని అనుసరించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అండర్‌ట్రయల్ ఖైదీలకు సంబంధించిన వ్యవహారాల్లో తీర్పులు వెలువడిన వెంటనే సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందించి, అవసరమైన ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించింది. ఖైదీలు అనవసరంగా జైలులో ఉండకుండా చర్యలు తీసుకోవడం న్యాయవ్యవస్థ బాధ్యత అని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం ఈ ఆదేశాలను జారీ చేసిన సుప్రీంకోర్టు, న్యాయం కోసం వేలాది మంది పిటిషనర్లు కోర్టుల ఎదుట ఎదురుచూస్తున్న పరిస్థితిని గుర్తు చేసింది. వారికి త్వరగా న్యాయం అందించడం న్యాయవ్యవస్థ కనీస కర్తవ్యమని పేర్కొంటూ, తీర్పుల జాప్యాన్ని తగ్గించేందుకు ఈ మార్గదర్శకాలు ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేసింది.

# వ్యవసాయానికి యువత దూరం



భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశంగా గుర్తింపు పొందినప్పటికీ, నేడు వ్యవసాయ రంగం ఒక కీలకమైన సవాలును ఎదుర్కొంటోంది. అదే యువత వ్యవసాయానికి దూరమవడం. ఒకప్పుడు రైతు కుటుంబాల్లో పుట్టిన పిల్లలు వ్యవసాయాన్ని తమ భవిష్యత్‌గా భావించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువత వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ఉన్నత విద్య, పట్టణాల్లో ఉద్యోగ అవకాశాలు, మెరుగైన జీవన ప్రమాణాల కోసం యువత వ్యవసాయ భూములను వదిలి ఇతర రంగాల వైపు అడుగులు వేస్తోంది. ఈ ధోరణి కొనసాగితే రానున్న రోజుల్లో వ్యవసాయ రంగం తీవ్ర మానవ వనరుల కొరతను ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యవసాయం పట్ల యువతలో ఆసక్తి తగ్గడానికి ప్రధాన కారణం ఆదాయంలో స్థిరత్వం లేకపోవడమే. వర్షాలు సకాలంలో పడకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు, పెరుగుతున్న సాగు ఖర్చులు, మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులు రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఏడాది పొడవునా కష్టపడి పంట పండించినా చివరికి లాభం వస్తుందనే హామీ లేకపోవడం యువతను నిరుత్సాహానికి గురి చేస్తోంది. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో నెలనెలా జీతం వచ్చే ఉద్యోగాలు యువతకు భద్రతగా కనిపిస్తున్నాయి. ఫలితంగా వ్యవసాయం కంటే ఇతర రంగాలే మెరుగైన భవిష్యత్‌ను ఇస్తాయనే భావన బలపడుతోంది.

గ్రామీణ ప్రాంతాల్లో విద్యా అవకాశాలు విస్తరించడంతో యువతలో ఆశయాలు కూడా మారుతున్నాయి. ఇంజినీరింగ్, వైద్యం, సమాచార సాంకేతికత, బ్యాంకింగ్, ప్రభుత్వ ఉద్యోగాలు వంటి రంగాల్లో స్థిరపడాలనే కోరిక పెరుగుతోంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు వ్యవసాయం కష్టాలు పడకుండా మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని కోరుకుంటున్నారు. సమాజంలో కూడా వ్యవసాయాన్ని కంటే ఇతర వృత్తులకు ఎక్కువ గౌరవం లభిస్తోందనే భావన ఉంది. దీంతో వ్యవసాయం కుటుంబ సంప్రదాయంగా కొనసాగాల్సిన అవసరం లేదని యువత భావిస్తోంది. ఈ మార్పు గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతోంది.

మరోవైపు సాగుభూముల విభజన కూడా వ్యవసాయ భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. తరతరాలుగా భూములు చిన్నచిన్న ముక్కలుగా విడిపోవడంతో లాభదాయక వ్యవసాయం కష్టమవుతోంది. యాంత్రీకరణ, ఆధునిక సాంకేతిక పద్ధతుల వినియోగానికి కూడా పరిమితులు ఏర్పడుతున్నాయి. చిన్న కమతాల్లో వ్యవసాయం చేయడం వల్ల ఆదాయం మరింత తగ్గుతోంది. ఈ పరిస్థితుల్లో యువత వ్యవసాయాన్ని అభివృద్ధి అవకాశాలు ఉన్న రంగంగా కాకుండా ఆర్థిక ప్రమాదాలతో కూడిన రంగంగా చూస్తోంది. దీనివల్ల గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు మరింత పెరుగుతున్నాయి. అయితే దేశ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయాన్ని యువతకు ఆకర్షణీయమైన రంగంగా మార్చడం అత్యవసరంగా మారింది. ఆధునిక సాంకేతికత, డ్రోన్ల వినియోగం, కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవసాయం, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తే యువత మళ్లీ వ్యవసాయం వైపు వచ్చే అవకాశం ఉంది. రైతుకు గిట్టుబాటు ధర, పంటలకు భద్రత, ఆధునిక శిక్షణ, సులభ రుణాలు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే యువత వ్యవసాయానికి దూరమవడం కేవలం రైతు కుటుంబాల సమస్య మాత్రమే కాదు. అది దేశ ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, భావితరాల భవిష్యత్‌కు సంబంధించిన అత్యంత కీలకమైన అంశం. అందుకే వ్యవసాయంలో యువత భాగస్వామ్యాన్ని పెంచడం నేటి అత్యవసర జాతీయ అవసరంగా మారింది.

# కానరీ దీవుల దినోత్సవం ఘనత



స్పెయిన్‌కు చెందిన కానరీ దీవుల్లో ప్రతి సంవత్సరం మే 30న కానరీ దీవుల దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ రోజు అక్కడి ప్రజలకు ఎంతో ప్రత్యేకమైనది. ద్వీపాల ప్రత్యేక చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేసుకుంటూ ప్రజలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొంటారు. ప్రాంతీయ స్వయం పాలనకు సంబంధించిన చారిత్రక పరిణామాలను స్మరించుకునే సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. అట్లాంటిక్ మహాసముద్రంలో ఉన్న కానరీ దీవులు స్పెయిన్‌లోని ప్రముఖ ప్రాంతాల్లో ఒకటి. ఏడు ప్రధాన ద్వీపాలతో కూడిన ఈ ప్రాంతం ప్రకృతి అందాలు, అగ్నిపర్వత పర్వతాలు, సముద్ర తీరాలు, పర్యాటక ఆకర్షణలకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏడాది లక్షలాది మంది పర్యాటకులు ఈ దీవులను సందర్శిస్తుంటారు. పర్యాటక రంగం స్థానిక ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారంగా నిలుస్తోంది. కానరీ దీవుల చరిత్ర ఎంతో విశిష్టమైనది. అనేక శతాబ్దాల క్రితం స్థానిక తెగల నివాస ప్రాంతంగా ఉన్న ఈ దీవులు తరువాత స్పెయిన్ పాలనలోకి వచ్చాయి. కాలక్రమేణా ప్రత్యేక ప్రాంతీయ గుర్తింపును పొందిన కానరీ దీవులు తమ భాషా సంప్రదాయాలు, జానపద కళలు, సాంస్కృతిక వారసత్వాన్ని ఇప్పటికీ కాపాడుకుంటున్నాయి. ఈ ప్రత్యేకతే వాటిని ప్రపంచంలో ఇతర ద్వీప ప్రాంతాల నుంచి భిన్నంగా నిలబెడుతోంది. దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. స్థానిక కళాకారులు జానపద నృత్యాలు, సంగీత ప్రదర్శనలు ఇస్తారు. సంప్రదాయ దుస్తులు ధరించిన ప్రజలు ఊరేగింపుల్లో పాల్గొని తమ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేస్తారు. వివిధ ప్రాంతాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, కళా కార్యక్రమాలు, ప్రజా వేడుకలు సందడి చేస్తాయి.

కానరీ దీవుల వంటకాలు కూడా ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. స్థానికంగా తయారు చేసే సంప్రదాయ ఆహార పదార్థాలను ప్రజలు ఆస్వాదిస్తారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ ఉత్పత్తులు, చేతివృత్తుల ప్రదర్శనలు కూడా నిర్వహిస్తారు. ఈ దినోత్సవం కేవలం ఒక పండుగ మాత్రమే కాదు. ప్రాంతీయ గుర్తింపు, ప్రజాస్వామ్య విలువలు, స్థానిక స్వయం పాలనకు ప్రతీకగా కూడా భావిస్తారు. గత తరాల పోరాటాలు, సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటూ భవిష్యత్ తరాలకు వాటి ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఈ రోజు ఉపయోగపడుతుంది. యువతలో ప్రాంతీయ చరిత్రపై అవగాహన పెంపొందించడంలో కూడా ఈ వేడుకలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పర్యాటక రంగానికి కూడా కానరీ దీవుల దినోత్సవం మంచి అవకాశంగా మారింది. ఈ సమయంలో నిర్వహించే రంగురంగుల కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తాయి. స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఇది అదనపు ఆదాయాన్ని తీసుకువస్తుంది. హోటళ్లు, రెస్టారెంట్లు, పర్యాటక సేవల సంస్థలు సందర్శకులతో కిటకిటలాడుతుంటాయి. ప్రజల ఐక్యత, ప్రాంతీయ గర్వం, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే కానరీ దీవుల దినోత్సవం ప్రతి ఏడాది విశేష ఉత్సాహంతో జరుగుతోంది. సంప్రదాయాలను సంరక్షిస్తూ ఆధునిక అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న కానరీ దీవుల ప్రజలకు ఈ రోజు ప్రత్యేకమైన గుర్తింపుగా నిలుస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# టికెట్ ధరల పెంపుపై నారాయణ విమర్శలు

భారీ సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరల పెంపు, బెనిఫిట్ షోలు, ప్రత్యేక ప్రీమియర్ ప్రదర్శనల వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సినీ ప్రముఖులు మెగా స్టార్ చిరంజీవి నివాసంలో సమావేశమై టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చే అదనపు ఆదాయంపై చర్చించారనే వార్తల నేపథ్యంలో సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన సినీ పరిశ్రమ తీరుపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. సినిమా అనేది ప్రజలకు వినోదాన్ని అందించే సామూహిక మాధ్యమమని, కళల పేరుతో సామాన్య ప్రజల జేబులు ఖాళీ చేయడం సరైన విధానం కాదని మండిపడ్డారు. భారీ బడ్జెట్ సినిమాలకు అధిక ఖర్చులు అవుతున్నాయనే కారణంతో టికెట్ ధరలను పెంచడం సమంజసం కాదని నారాయణ అభిప్రాయపడ్డారు. బెనిఫిట్ షోలు, ప్రత్యేక ప్రీమియర్ షోలు, అదనపు ప్రదర్శనల పేరుతో ప్రేక్షకుల నుంచి భారీ మొత్తాలు వసూలు చేయడం వల్ల మధ్యతరగతి కుటుంబాలు థియేటర్లకు వెళ్లడానికే వెనుకాడే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఒకేచోట సమావేశమై టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చే అదనపు ఆదాయాన్ని ఎలా పంచుకోవాలనే అంశంపై చర్చించడం ఆందోళనకర విషయమని నారాయణ వ్యాఖ్యానించారు. కళారంగం ప్రజలకు దగ్గరగా ఉండాలని, కొద్దిమంది వ్యాపార ప్రయోజనాల కోసం మాత్రమే వేదికగా మారకూడదని సూచించారు. సినిమా అనేది అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వినోద మాధ్యమమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం పెద్ద సినిమాల టికెట్ ధరలు సాధారణ కుటుంబాలకు భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా థియేటర్‌కు వెళ్లాలంటే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోందని అన్నారు.

ప్రత్యేక షోలు, ప్రీమియర్ టికెట్లు, ఫ్లెక్సీ ధరల పేరుతో భారీ మొత్తాలు వసూలు చేయడం వల్ల సినిమా సామాన్య ప్రజలకు దూరమయ్యే ప్రమాదం ఉందని నారాయణ హెచ్చరించారు. భారీ సినిమాల పేరుతో ప్రేక్షకులపై ఆర్థిక భారం మోపడం సరైన ధోరణి కాదని అభిప్రాయపడ్డారు. టికెట్ ధరల పెంపు విషయంలో ప్రభుత్వాలు స్పష్టమైన విధానాలు తీసుకురావాలని ఆయన సూచించారు. కళల అభివృద్ధి పేరుతో దోపిడీకి అవకాశం ఇవ్వకూడదని అన్నారు. పెద్ద సినిమాలకు ప్రత్యేక అనుమతులు ఇచ్చే సమయంలో ప్రేక్షకుల ఆర్థిక పరిస్థితిని కూడా పరిగణలోకి తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు. సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందడం ఎంత ముఖ్యమో, ప్రేక్షకుల ప్రయోజనాలను కాపాడటం కూడా అంతే ముఖ్యమని నారాయణ పేర్కొన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న టికెట్ ధరలు, ప్రత్యేక ప్రదర్శనల వ్యవహారం పై ప్రభుత్వం సమగ్ర విధానం తీసుకురావాల్సిన అవసరం ఉందని రాజకీయ వర్గాలు కూడా అభిప్రాయపడుతున్నాయి.

# రజినీతో అనసూయ ప్రత్యేక క్షణం



టాలీవుడ్‌లో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించి, అనంతరం నటిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అనసూయ భరద్వాజ్ ప్రస్తుతం మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సూపర్ స్టార్ రజినీకాంత్‌తో కలిసి దిగిన ఫోటోలను ఆమె సోషల్ మీడియాలో పంచుకోవడంతో అభిమానుల్లో ఆసక్తికర చర్చలు మొదలయ్యాయి. “నా జీవితంలో ఎప్పటికీ అభిమానించే వ్యక్తి” అంటూ రజినీకాంత్‌పై తన అభిమానాన్ని వ్యక్తపరుస్తూ అనసూయ చేసిన పోస్టు ప్రస్తుతం వైరల్ అవుతోంది.

బుల్లితెరపై ప్రసారమైన ప్రముఖ కామెడీ కార్యక్రమం ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైన అనసూయ.. తన అందం, యాంకరింగ్ శైలి, మాటతీరుతో ప్రత్యేక అభిమాన వర్గాన్ని సంపాదించుకుంది. కేవలం యాంకర్‌గా మాత్రమే కాకుండా నటిగా కూడా తన ప్రతిభను నిరూపించుకోవాలని భావించిన ఆమె.. వెండితెరపై వరుస అవకాశాలు అందుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.

ముఖ్యంగా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రంలో రంగమ్మత్త పాత్రలో కనిపించిన అనసూయ నటనకు ప్రశంసలు వెల్లువెత్తాయి. అనంతరం పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన చిత్రంలో దాక్షాయణి పాత్రలో నటించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి వేసవి సెలవులకు వెళ్లిన అనసూయకు అక్కడ ఒక ప్రత్యేక అనుభవం ఎదురైంది. దక్షిణ భారత సినీ పరిశ్రమలో లెజెండరీ నటుడిగా గుర్తింపు పొందిన రజినీకాంత్‌ను ప్రత్యక్షంగా కలిసే అవకాశం ఆమెకు లభించింది. ఈ సందర్భంగా ఆయనతో కలిసి దిగిన ఫోటోలను అభిమానులతో పంచుకుంది.

ఈ ఫోటోల్లో అనసూయ ముఖంలో కనిపిస్తున్న ఆనందం అభిమానులను ఆకట్టుకుంటోంది. రజినీకాంత్ పట్ల ఆమెకు ఉన్న అభిమానం స్పష్టంగా కనిపిస్తోందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. కొందరు అభిమానులు “ఇది ఆమెకు జీవితాంతం గుర్తుండిపోయే క్షణం” అంటూ స్పందిస్తున్నారు.

అయితే ఈ ఫోటోలు బయటకు వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. రజినీకాంత్ నటిస్తున్న తదుపరి చిత్రంలో అనసూయకు కీలక పాత్ర దక్కిందని కొందరు ప్రచారం చేస్తున్నారు. అందుకే ఈ ఫోటోల ద్వారా సంకేతాలు ఇచ్చిందని అభిప్రాయపడుతున్నారు. మరికొందరు మాత్రం ఇది పూర్తిగా అభిమానంతో దిగిన ఫోటో మాత్రమేనని చెబుతున్నారు. ఇప్పటివరకు ఈ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినా.. రజినీకాంత్‌తో అనసూయ కనిపించడం అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి.

## ‘పెద్ది’పై ట్రోలింగ్, పైరసీకి చెక్..

# మేకర్స్ సీరియస్ చర్యలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’ విడుదలకు సిద్ధమవుతున్న వేళ.. సినిమా చుట్టూ సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్, నెగిటివ్ ప్రచారంపై చిత్ర బృందం సీరియస్‌గా స్పందించింది. ‘ఉప్పెన’ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ డ్రామాపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. గ్రామీణ క్రీడల నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రం జూన్ 4న ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవలి కాలంలో స్టార్ హీరోల సినిమాలు విడుదలకు ముందే సోషల్ మీడియాలో నెగిటివ్ ట్రెండ్స్, ఫేక్ హ్యాష్‌ట్యాగ్ క్యాంపెయిన్లు పెరుగుతున్న నేపథ్యంలో.. ‘పెద్ది’ బృందం ముందుగానే అప్రమత్తమైంది. ముఖ్యంగా ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలపై కొన్ని ఫేక్ ఖాతాల ద్వారా సినిమాపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం జరుగుతోందని మేకర్స్ ఆరోపిస్తున్నారు. రామ్ చరణ్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ, సినిమాపై నెగిటివ్ ప్రచారం నిర్వహిస్తున్నారని పేర్కొంటూ నిర్మాతలు సైబర్ క్రైమ్ అధికారులకు అధికారిక ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ ప్రారంభించినట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి, హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన మరో వ్యక్తిపై ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు తెలుస్తోంది. కొన్ని సోషల్ మీడియా ఖాతాలు ఒకే తరహా పోస్టులు, ఒకే హ్యాష్‌ట్యాగ్‌లతో సమన్వయంగా ట్రోలింగ్ నిర్వహిస్తున్నాయని అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇది కేవలం వ్యక్తిగత స్థాయి ట్రోలింగ్ మాత్రమే కాకుండా.. డబ్బులు తీసుకుని నిర్వహించే వ్యవస్థీకృత నెగిటివ్ క్యాంపెయినా? అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. పెద్ద సినిమాలపై కావాలనే నెగిటివ్ ట్రెండ్స్ సృష్టించడం ద్వారా సోషల్ మీడియాలో విషపూరిత వాతావరణం ఏర్పడుతోందని సినీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా విడుదలకు ముందు సినిమాపై చెడు ప్రచారం చేసి ప్రేక్షకుల్లో అనవసర సందేహాలు సృష్టించే ప్రయత్నాలు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు.

మరోవైపు ట్రోలింగ్‌తో పాటు పైరసీ వ్యవహారాన్ని కూడా ‘పెద్ది’ మేకర్స్ అత్యంత సీరియస్‌గా తీసుకున్నారు. సినిమా విడుదలకు ముందే నిర్మాతలు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించి ప్రత్యేక రక్షణ కోరారు. దీనిపై స్పందించిన కోర్టు ‘యాంటీ పైరసీ ఇంజంక్షన్’కు సంబంధించిన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ ఉత్తర్వుల ప్రకారం.. సినిమా విడుదలైన తర్వాత అనుమతి లేకుండా ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేయడం, టెలిగ్రామ్ ఛానల్స్, టోరెంట్ సైట్లు, పైరసీ వెబ్‌సైట్ల ద్వారా ప్రసారం చేయడం పూర్తిగా చట్టవిరుద్ధం. పైరసీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇక ఈ కేసులో కోర్టు ‘డైనమిక్ ఇంజంక్షన్’ను కూడా మంజూరు చేయడం విశేషంగా మారింది. సాధారణంగా ఒక పైరసీ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే.. నిర్వాహకులు కొత్త డొమైన్ లేదా కొత్త యూఆర్ఎల్‌తో మళ్లీ యాక్టివ్ అవుతుంటారు. అయితే ఈసారి అలాంటి అవకాశాలను కూడా పూర్తిగా అడ్డుకునేలా ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఒకసారి గుర్తించిన పైరసీ నెట్‌వర్క్ కొత్త పేర్లతో, కొత్త లింక్‌లతో తిరిగి వచ్చినా వెంటనే బ్లాక్ చేసే అధికారాన్ని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ‘పెద్ది’ విడుదల సమయంలో పైరసీని గట్టిగా అరికట్టే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in